# www.appgv.org

appgv.email@gmail.com



**గిరిధర్‌వాణి సత్యవర్ష**

ప్రచురణకర్త, ముద్రించువారు

**శ్రీ బి. గిరిధర్‌సింగ్**

గిరిధర్‌వాణి సత్యవర్ష
9-62-77, మైన్ స్ట్రీట్,
ఇస్లాంపేట, విజయవాడ-1
ఫోన్: 0866 - 3294745



| | |
|---|---|
| ముందుమాట | - 3 |
| మొదటి రోజు | - 4 |
| రెండవ రోజు | - 11 |
| మూడవ రోజు | - 17 |
| నాల్గవ రోజు | - 21 |
| ఐదవ రోజు | - 27 |
| ఆరవ రోజు | - 33 |
| ఏడవ రోజు | - 36 |
| ఎనిమిదవ రోజు | - 39 |
| తొమ్మిదవ రోజు | - 43 |



Copy Rights Reserved



ఈ సంచిక ప్రాప్తిస్థానము

వెల: రూ. 25/-
పోస్టేజ్ అదనం

శ్రీ బి. గిరిధర్‌సింగ్,
గిరిధర్‌వాణి సత్యవర్ష, 9-62-77,
ఇస్లాంపేట, విజయవాడ - 520 001, ✆: 0866 - 3294745, 5545745
గిరిధర్‌వాణి ఆనంద నందనం, తాడేపల్లి, ఫోన్: 08645 - 273373
website : www.giridharvani.org
email : info@giridharvani.org - giridharvani@yahoo.co.in




## ముందుమాట

ప్రేమ, దానిని ఎలా నిలుపుకోవాలి? ఇది ఎక్కడ చూసినా కనిపించే సమస్య. ప్రేమ అంటే అందరికీ తెలుసు. కానీ నిజంగా ప్రేమ గురించి ఎవరికీ తెలియని విషయాలు ఎన్నో వున్నాయి. ఇవి ఏ జాతికైనా, మతానికైనా, కులానికైనా, ఏ దైవాన్ని అనుసరించే వారికైనా కావాల్సిన విషయాలు.

కాబట్టి ఆ నిరంతర సహచరిని నీకు నిజమైన కోణంలో పరిచయం చేసేదే ఈ BOOK బుక్.

పరిపూర్ణ పరబ్రహ్మ గిరిధర్‌వాణి

## ప్రేమ - మొదటి రోజు

పరిపూర్ణ పరబ్రహ్మ గిరిధర్‌వాణికి జై!

సమస్తాన్ని తనలో కలిగి వుండి, సమస్తమూ నిండి వున్న పరిపూర్ణ పరబ్రహ్మ గిరిధర్‌వాణిని నా యజమానిగా స్వీకరిస్తున్నాను.

సర్వాధారుడైన నా ప్రభువు నిరాధారంగా నాపై కృపను వర్షిస్తారని విశ్వసిస్తున్నాను.

నా సమస్తానికి ప్రభువు అయిన పరిపూర్ణ పరబ్రహ్మ గిరిధర్‌వాణికి నా కృతజ్ఞతలు.

## ప్రేమ

ప్రతి జీవిని ఆహ్లాద పరిచేది ప్రేమ. తనను తను మరచిపోయేలా మురిపించేది ప్రేమ. ప్రపంచ సుఖాల పట్ల వున్న ప్రేమ అయినా సరే లేదా దైవం పట్ల వున్న ప్రేమ అయినా జీవిని ఉన్నత శిఖరాలను ఎక్కిస్తుంది, అదే అధః పాతాళంలోకి తోసేస్తుంది.

"ప్రేమ" అన్న పదాన్ని సరిగ్గా అవగాహన చేసుకోలేక, అర్థం చేసుకోలేక జీవి దాని మాధుర్యాన్ని చవి చూడలేక పోతున్నాడు.

జీవిలో కలిగే ప్రతీ స్పందనకీ "ప్రేమ" అని నామకరణం చేసి అనేక అవస్థలు పడుతున్నాడు జీవి.

ఏ ఇద్దరి మధ్య కూడా ఈ ప్రేమ సత్ఫలితాలను ఇవ్వట్లేదు.

తల్లితండ్రులు - పిల్లలు : భార్య - భర్తలు : గురు - శిష్యులు భగవంతుడు భక్తుడు ఇలా ఏ ఇరు వర్గాల మధ్యన వున్న ప్రేమ అయిన అవగాహనా రాహిత్యం వల్ల ఫలించట్లేదు.

ఈ ఫలించట్లేదు అన్న విషయం కూడా ఎవరూ గమనించట్లేదు.

అసలు ప్రేమ అంటే ఏమిటి ? అది ఫలించటం అంటే ఏమిటి?

ప్రేమ ఇచ్చించే ఫలం ఏమిటి? ఇవన్నీ కూడా బహిరంగంగా మనం చర్చించుకుని తెలుసుకోవాల్సిన అవసరం వుంది.

ఈ అవగాహన రాహిత్యం వల్లే జీవి వుంటే పూర్తిగా విషయ వాసనలతో నిండి వుంటున్నాడు లేదంటే సర్వాన్ని పరిత్యజించి వేదాంత ధోరణిలోనైనా వుంటున్నాడు కానీ సమస్థితిలో తన జీవితాన్ని ఆనందించ లేకపోతున్నాడు.

ఈ చర్చ ఆస్తికులకి సంబంధించినది, ఒక దైవానికి సంబంధించిన, ఒక



కులానికి, ఒక మతానికీ, ఒక దేశానికి సంబంధించినది కాదు. ఇది, ఏ కులస్తుడైనా, ఏ మతస్థుడైనా, ఏ దేశస్తుడైనా, ఆస్తికుడైనా, నాస్తికుడైనా ఎవరైనా అర్థం చేసుకోవాల్సిన విషయమే.

ప్రతీ వారికి అర్థమయ్యీ, అర్థం కాక: అందీ అందక వుండే ప్రేమను అర్థం చేసుకుంటే లభించేది విడుదల, ఆనందం, శాంతి.

## ప్రేమ :- నీ నిరంతర సహచరి

### Love :- Your Continuous Companion

నీతో పుట్టి, నీతోనే సహ జీవనం చేస్తూ వుంటుంది.

ప్రేమ ఫలం :- నిన్ను దేనినీ అంటుకోనీయక, నీకు ఏది అంటక నిన్ను నిన్నుగా వుంచుతుంది.

ప్రేమను చాలా తొందరగా జీవితపు తొలిదశలో అర్థం చేసుకుంటే అది నీకు ఏదీ అంటక నిన్ను నిన్నుగా నిలబెడుతుంది.

అంటే ఆలస్యమైనా సరే ఇప్పటికైనా ప్రేమను అర్థం చేసుకుంటే మంచిదే. ఇంత జీవితం గడిచిపోయింది ఇంక ఇప్పుడు తెలుసుకునేది ఏముందిలే అనుకోవద్దు.

ఏ క్షణంలో అర్థం చేసుకున్నా ఆ క్షణం నుంచి నీకు అంతా శుభమే. ఎందుకంటే ప్రేమ అంటే మన సహచరి అనుకున్నాం కదా, కాబట్టి ఏక్షణమైనా అది మనలోనే వుంటుంది కదా. ఏ క్షణం నీవు దానిని అర్థం చేసుకుంటే ఆ క్షణమే నీకు అది శుభాన్ని ఇస్తుంది.

జీవితపు ప్రారంభ దశలో అవగాహన అయితే అసలు నీకు ఏదీ అంటనివ్వదు కొంత జీవితం గడిచాక అయితే నీకు అప్పటి దాకా అంటిన వాటి నుండీ విడుదల చేసి మరీ నిన్ను నిన్నుగా వుంచుతుంది. అసలు నువ్వు నువ్వుగా ఎలా వుండలేకపోతున్నావు అది నీకు ప్రేమ వల్ల ఎలా సాధ్యమో తెలుసుకుందాం.

నీకు తెలిసినా నువ్వు ఒప్పుకోలేని సత్యాల గురించి మాట్లాడుకుంటూ వాటిని స్వీకరిద్దాం.

ఏ ఇద్దరి మధ్యన వున్న "ప్రేమ" అని మీరనుకునే భావం, ఇరువర్గాల వారినీ బలహీన పరుస్తుంది. అదే సరైన అవగాహన వుంటే ఇరు వర్గాలనీ బలపరుస్తుంది.

తల్లిదండ్రులు - పిల్లలు :-
ఏ జీవి అయినా అధిక కాలం ఆనందించేది, దుఃఖించేది ఈ బంధంలోనే.

<u>తల్లిదండ్రులు పిల్లలను ప్రేమించాలి అనగానే అందరూ అనుకునే ప్రేమ :-</u>
పిల్లలను పెంచటం మన బాధ్యత, వారికి తినిపించాలి అది వాడికి ఇష్టం వున్నా లేకపోయినా, వారిని చదివించాలి ఇష్టం వున్నా లేకపోయినా, వారికేమీ తెలీదు మనమే చేయాలి. మనకు పేరు ప్రతిష్టలు తేవాలి. వారు పేరు ప్రతిష్టలు తెచ్చుకోవాలి. అసలు తప్పులే చేయకూడదు అందుకు కఠినమైన ఆంక్షలు పెట్టాలి. వాడి ఏ చర్యైనా మన దృష్టిని దాటి పోనీయకూడదు ఇలా వుంటాయి. అభిప్రాయాలు కొంచెం modern parents అయితే ఏమి చేసినా ok, మనకి అనవసరం వాళ్ళకి కావల్సిన freedom ఇవ్వాలి అని పూర్తిగా గాలికి వదిలేస్తారు.
<u>అలాగే పిల్లలు, తల్లిదండ్రులను ప్రేమిస్తున్నదీ లేనిదీ ఎలా లెక్కకడతారంటే :-</u>
పిల్లలు తల్లిదండ్రుల ఇష్టాన్నే తమ ఇష్టాలుగా భావించాలి. తల్లి తండ్రుల కోసం తమని తాము త్యాగం చేసుకోవాలి తల్లిదండ్రులను గమనిస్తూ ప్రవర్తించాలి. వారికి చెప్పకుండా ఏది చేయకూడదు. తల్లిదండ్రుల పెంపకపు ఋణం తీర్చుకోవాలి. ఇలాంటి భావాలతో పిల్లలకు ప్రేమ వుందా, లేదా అని లెక్కకడతారు.

<u>కానీ దీని ఫలితం :</u> ఇది ప్రేమ అనుకుంటే మరి ఎలాంటి ఫలితాన్ని ఇస్తుందో చూద్దాం. పిల్లల బరువు బాధ్యతలలో తల్లిదండ్రులు, తల్లిదండ్రుల ఆజ్ఞ పాలనలో పిల్లలు బందీలు అవుతున్నారుగా. ఒకరి పై ఒకరు పెట్టుకునే ఆంక్షలు, ఆకాంక్షలు వల్ల ఇద్దరి మధ్యా ఎలాంటి పరిస్థితి ఏర్పడుతుందంటే కాసేపు వారికి దూరమయితే కానీ ప్రశాంతత రాదు. తల్లిదండ్రుల ఆజ్ఞ పాలన చేయలేక, తమ ఇష్టాన్ని చంపుకోలేక పిల్లలు కొన్నాళ్ళు parents కి దూరంగా గడిపితే కానీ ప్రశాంతత రాదు అని భావిస్తారు. అలాగే పిల్లలు school కో, offices కో వేరే దేశాలకో వెళ్తే కానీ parents కి ప్రశాంతత రాదు. ఒకరి నుంచి ఒకరు పారిపోతే కానీ ఒకరి నుంచి ఒకరిపై పడే ఒత్తిడి తగ్గదు. మళ్ళీ ఎదురైతే మళ్ళీ ఒత్తిడే ప్రారంభం. దీనిని తప్పించుకోటానికి తల్లిదండ్రులు వృద్ధాశ్రమాలకు, పిల్లలు తిరిగి రావటానికి కూడా దొరకని దూర ప్రాంతాలకు వెళ్ళిపోవటం.
ఒకరికి ఒకరు దూరమైతేనో, లేదా దగ్గరగా వుంటేనో కానీ ప్రశాంతత రానిది ప్రేమ ఎలా అవుతుంది.



ఏమైపోతాయో అన్న భయంతో ఇరు వర్గాలు దగ్గరైనా వుండాలి వంకబెట్టి ప్రగతిని కాదని లేదా దూరమైనా అయిపోవాలి ప్రగతి కోసమని ఇలా తల్లిదండ్రులు - పిల్లల మధ్య సంబంధమే సరిగా లేకుంటే కుటుంబం ప్రశాంతంగా వుండదు. తద్వారా సమాజం సరిగ్గా వుండదు.

గిరిధర్‌వాణి అంటే అది గురువు ఏదో ఆధ్యాత్మిక సందేశాలు వినిపిస్తారు. అనుకుంటే ఇలా తల్లిదండ్రులు, పిల్లలు అని కాలక్షేపం చేస్తున్నారు. అనిపిస్తోంది . ఆత్మ, పరమాత్మ అని ఉపన్యసిస్తేనే ఆధ్యాత్మికమా? వాటిని అనుభవించాలంటే, అన్వయించుకోవాలంటే ముందు నువ్వు నిలకడగా ప్రశాంతంగా వుండాలిగా! అలా వుండాలంటే ఎక్కడ లోటుపాట్లు వున్నాయో తెలుసుకోవాలిగా! ఇవే విషయాలను రామాయణాలు, భారతాలు, భాగవతాలు ఇలా పురాణకాలక్షేపాలుగా indirect గా చెప్తే వాటిని అన్వయించుకోలేక పోయాముగా! అందుకే direct గా వున్నది ఉన్నట్లు మాట్లాడుకుంటున్నాం.

నిజమైన ఆధ్యాత్మిక ప్రసంగమే ఇది. సంఘ సంస్కరణ కోసం కాదు.
అయితే సంఘ సంస్కరణం అంతర్లీనంగా వుంది.

<u>నువ్వు ఏ బంధాలలో ఇరుక్కు పోకుండా నిన్ను నిన్నుగా వుంచేది ఏ ప్రసంగమైనా ఆధ్యాత్మిక సంబంధమైనదే కదా!</u>

నిన్ను నిన్నుగా నిలబెడతానికి చేస్తున్న ఈ సస్త్రాహము నిజమైన ఆధ్యాత్మికము!

కాబట్టి ఇలా తల్లిదండ్రులు - పిల్లలు ఒకరి నుంచి ఒకరు escape అవ్వటానికి ప్రయత్నించినా, బలవంతాన తప్పదని కలిసి బ్రతికినా అది ప్రేమ కాదుగా మరి తల్లిదండ్రులు పిల్లల మధ్య ప్రేమ అంటే ఎలా వుంటుందో, వుండాలో చూద్దాం. ఒప్పుకుని అన్వయించు కొందాం. మన పిల్లలు మన నుంచి పారిపోకుండా, మన తల్లిదండ్రులు మన వల్ల ఇబ్బంది పడకుండా చూసుకుందాం. తల్లిదండ్రులకు, పిల్లలు పుట్టిన క్షణం నుండి, పుట్టిన పిల్లవాడి సహచరిగా ప్రేమ పుడుతుంది. పిల్లవాడి కోణంలో నుంచి ఈ ప్రేమను విశ్లేషిస్తే పుట్టినవాడు, వాడికి తోడుగా పుట్టిన సహచరి, ప్రేమను ఆధారంగా చేసుకుని లతగా పాకుతాడు, ఎదుగుతాడు. అలాగే తల్లిదండ్రులు వాడికి ఎలా సహకరించాలి అంటే, పుట్టిన వాడిని, వాడి సహచరి సహాయంతో ఎదగనివ్వాలి. ఏ ఆంక్షలు పెట్టకుండా వుండాలి. వాడి యొక్క సొంత అవగాహన develop అయ్యేలాగా మన అవగాహనని వాడిపై రుద్దకూడదు. అలా మన అవగాహనని,

మన పాత అనుభవాలని వాటిపై రుద్దితే ఒక జీవి ఉద్ధరింపులోకి రాకుండా అడ్డుపడుతున్నట్లే అన్న విషయాన్ని అవగాహన చేసుకోవాలి. తల్లితండ్రులు లేని పిల్లలు కూడా జీవితంలో ఎదుగుతున్నారంటే వారికి వారి ప్రేమే కదా ఆధారమయింది. తల్లితండ్రులకు పిల్లలపై వున్న ప్రేమ ఎలా వుండాలంటే, పిల్లవాడు తను స్వేచ్ఛగా అడుగువేసే అవకాశం ఇవ్వాలి. అలా తన సొంత అడుగు వేసిన పిల్లవాడు విజయం పొందితే ప్రోత్సాహించాలి అపజయం పొందితే నిరాశ పడనీయక మరో అడుగు కూడా సొంతంగా వేసే ప్రోత్సాహం ఇవ్వాలి. "నువ్వు నీ సొంతంగా try చేసి విజయం పొందలేదు. కాబట్టి ఇంక నేను చెప్పినట్లు విను" అనకూడదు. పిల్లవాడు సొంత అడుగు వేసి విజయం పొందేదాకా ప్రోత్సహించేదే తల్లితండ్రుల నిజ ప్రేమ.

ఎన్ని సంవత్సరాలు గడిచినా, ఎన్నిసార్లు విఫలమయినా పిల్లవాడు సొంత అడుగువేసి విజయం పొందేలా చేసేదే తల్లితండ్రుల ప్రేమ.

అలా చెయ్యాలంటే తల్లితండ్రులు పిల్లలను నమ్మితే చాలు. ఆ నమ్మకం రావాలంటే పిల్లవాడికి తోడుగా "ప్రేమ" అనే సహచరి వుంది, ఆ సహచరి పిల్లవాడికి తల్లితండ్రుల యొక్క ప్రాముఖ్యతను తెలియచేస్తుంది అని తల్లితండ్రులు గుర్తిస్తే చాలు.

అదే ప్రేమ పిల్లవాడికి, తన జయాపజయాలు నిర్మొహమాటంగా తల్లితండ్రులతో చర్చించే ధైర్యాన్ని ఇస్తుంది.

పిల్లవాడు తనకు అపజయం కలిగిన ప్రతిసారి మొదటిగా తల్లితండ్రులనే గుర్తు చేసుకునేంతగా ప్రేమ వాడికి ధైర్యాన్ని ఇస్తుంది.

తల్లితండ్రులు పిల్లలు అన్న విభాగంలో ఎక్కువ అవగాహన చేసుకోవాల్సింది తల్లితండ్రులే. వాళ్ళ అవగాహన దానంతట అదే పిల్లలని అదే మార్గంలో నడిపిస్తుంది.

తల్లితండ్రులు - పిల్లల మధ్య నిజ ప్రేమ ఉంది అంటే అది ఎలా వుంటుందంటే:

పిల్లవాడు సొంత అవగాహనతో అడుగు వేయటానికి ప్రోత్సహిస్తుంది. అలా అడుగు వేసినప్పుడు ఎన్నిసార్లు అపజయం వచ్చినా తిరిగి సొంత అడుగు వేయటానికి ప్రోత్సహిస్తుంది.

అలాగే పిల్లవాడు తన అపజయాన్ని తల్లితండ్రులతో నిర్భయంగా చెప్పటానికి, మరో అడుగు సొంతంగా వేయటానికి ధైర్యాన్ని ఇస్తుంది.



ఆ ప్రేమ పిల్లలకు బుద్ధులు నేర్పించదు. ఉన్న బుద్ధి, వివేకంగా, స్వార్థిగా ఎదగడానికి ప్రోత్సహిస్తుంది.

అలాంటి ప్రేమ, తల్లితండ్రులకు - పిల్లలకు మధ్యరావాలంటే ఏమి చేయాలి:-

పిల్లలకు తోడుగా వారి సహచరి అయిన ప్రేమ వుంది. ఆ ప్రేమే పిల్లలకు, తల్లితండ్రులకు మధ్య దానంతట అదే వారధిగా పనిచేస్తోంది. ఆ ప్రేమ సహాయంతో ఎదిగిన పిల్లవాడి వెనకాల సమస్తమూ దానంతట అదే వస్తుంది. నా ప్రభావం పడితే నా ఇష్టంలో వుండే పిల్లవాడు, ప్రేమ ప్రభావం పడితే సమస్తంలోనూ వుంటాడు. అదే విషయాన్ని తల్లితండ్రులు గుర్తించాలి. ఒప్పుకోవాలి. అవగాహన చేసుకుని ఆ అవగాహనతో ప్రవర్తిస్తే చాలు. ఆ అవగాహనతో ప్రవర్తించాలి అని సంకల్పించుకుంటే చాలు.

అలాంటి నిజ ప్రేమ వల్ల ఎలాంటి ఫలితం వస్తుందంటే :-

తల్లితండ్రుల, పిల్లల మధ్య సత్యం నిలుస్తుంది.

సొంత అడుగు వేయటం నేర్చుకున్న పిల్లల వల్ల తల్లితండ్రులకు మనశ్శాంతి లభిస్తుంది. పిల్లలని భారంగా భావించి వదిలిపోవాలనే తలంపుతో వుండరు.

తమ అపజయాలను కూడా ధైర్యంగా తల్లితండ్రులతో చెప్పుకోగల్గినప్పుడు పిల్లలు, తల్లితండ్రులకు దూరం కావాలనే తలంపునే రానీయరు.

ఒకరికొకరు తప్పించుకోలేని భారం కారు. ఇరు వర్గాల మధ్యా friction వుండదు.

తల్లితండ్రులకు అలాగే పిల్లలకు "సొంతంగా చేయడం" అలవాటై ఆ సొంతమే క్రమేణా పెరిగి self develope అవుతుంది.

దాని వల్ల ప్రతి వారూ (తత, పి) వారి దివ్యత్వాన్ని అనుభవిస్తారు.

తల్లితండ్రులకి, పిల్లలకి మధ్య ప్రేమ దానంతట అదే తిరుగుతుంది కానీ, ఋణాలు, బంధాలు ఏర్పడవు.

బంధం వుంటే అంటే తెగిపోవటమూ వుంటుందిగా,

ఋణాలు వున్నాయి అంటే తీరిపోతాయనేగా,

అంటే అవి తీరగానే విడిపోవటమేగా,

అలాకాక ప్రేమ నిలబడితే, ప్రేమే transfer అయితే మిగిలేది ప్రేమేగా.

ఈ తల్లితండ్రులు, పిల్లల వర్గాన్ని correct అవగాహన చేసుకుని అన్వయించుకుంటే మూడు జీవులు మనశ్శాంతితో బ్రతుకుతూ self ను ఉద్ధరించుకున్నట్లే

అలాంటి అవగాహన కల తల్లితండ్రుల best wishes పిల్లలకు అసలైన

భగవంతుడి ఆశీర్వాదంతో సమానం.

అలాంటి అవగాహన కల పిల్లల best wishes తల్లితండ్రులకు ఋణాల నుంచి విడుదలను ప్రాప్తింప చేస్తుంది.

పిల్లల వల్ల పున్నామ నరకం దాటుతారని, స్వర్గ ద్వారాలు తెరుచుకుంటాయని అంటే అదే.

అలాంటి తల్లితండ్రుల రూపంలోనే పిల్లలకు భగవంతుడు అందుబాటులో వుంటాడు. అలాగే పిల్లల ద్వారా తల్లితండ్రులకు అందుబాటులో వుంటాడు. అలాంటి తల్లితండ్రులు, పిల్లలు ఒకరికొకరు భగవత్ స్వరూపాలే.

ఇలా కాకుండా, పిల్లలని పెంచుతూ, అన్నాడని tenstion, లేదని tenstion ఉద్యోగం రాలేదని, పెళ్ళి కాలేదని tenstion పడుతూ సుఖంగా ఉండక, ఉండనివ్వక, చిరాకు పడి, చిరాకుపెడుతూ ఎంత భగవంతుడికి పూజలు వ్రతాలు, ప్రార్థనలు చేసినా పిల్లలు బాగుపడతారా? తల్లితండ్రులు బయటపడతారా? సమాజం బాగుపడుతుందా! కాబట్టి ఆలోచించండి. తరాల నుంచీ బాధ్యత తీసుకుని, బంధాలు వేసుకోవటం అలవాటు అయింది కాబట్టి, ఒక్కరోజులో అలవాటు పోవాలన్నా పోదు. కానీ మీ పిల్లలు సదా జీవించి, సుఖంగా జీవించి, ప్రేమలో నిలబడాలి అన్న అవసరాన్ని గుర్తిస్తే వెంటనే సాధ్యం.

ఇదే కర్మ సన్యాసమని, అసంగమని చెప్తే అర్థం కాక, అన్నీ వదిలేసి సన్యసించినా విజయం రాక ఇబ్బంది పడ్డారు. కర్మలను అంటకుండా చేయండి, కర్మ ఫలాలను త్యాగం చేయండి అంటే అర్థం కాదు. అన్వయింపు రాదు కాబట్టి, ఎలా వుంటే కర్మలు అంటవో, ఎలా ఉంటే మన కర్మలు త్యాగం చేయాల్సిన ఫలాలను ఇవ్వవో విశ్లేషించుకున్నాం.

స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, అనే ఫలాలు వస్తే త్యాగం చేసుకోవక్కర్లేదుగా

కాబట్టి ఇది నిజంగా, నిజమైన ఆధ్యాత్మిక ప్రసంగమే. జీవికి తద్వారా సమాజానికి కూడా ఉపయోగపడే ప్రసంగమే.

ఇది ప్రయత్నిస్తున్న తొలిదశలో, అందరికీ తెలిసిన పద్ధతికి విరుద్ధంగా వుంది కాబట్టి ఏవైనా అవరోధాలు రావచ్చు. కానీ నిజాన్ని అర్థం చేసుకోగల్గితే ఆ అవరోధాలను అధిగమించొచ్చు, బాధ్యత లేని తల్లితండ్రులు అని ముద్ర వేసినా, భయపడక మీ నిజ బాధ్యత మీ పిల్లలను సొంతంగా నిలబెట్టడమే, self లో నిలబెట్టడమే అని గుర్తించండి. అప్పుడు అవరోధాలను తేలికగా అధిగమిస్తారు. ఒకేసారి మూడు జీవులు విడుదల పొంది స్వేచ్ఛను అనుభవిస్తారు.



## భార్యా-భర్తల మధ్య ప్రేమ - రెండవ రోజు

తల్లితండ్రులు - పిల్లల మధ్య ప్రేమను నిలుపుకుని ఫలాన్ని పొందే విషయంలో ఎక్కువగా తల్లితండ్రులే అవగాహన చేసుకోవాల్సిన అవసరం వుంది.

కానీ భార్యా-భర్తల మధ్య ప్రేమను నిలుపుకుని ఫలాన్ని పొందే విషయంలో ఇద్దరికీ అవగాహన వుండాలి.

ముందు section అలవాటు అయిన వాళ్ళకి అంటే తల్లితండ్రుల - పిల్లల మధ్య ప్రేమను ఫలింపచేసుకున్న వారికి ఈ episode లో విశ్లేషించినది దానంతట అదే జరుగుతుంది. ఎందుకంటే వారి ప్రేమకు ఫలాలను ఇవ్వడం అలవాటు అయిపోయింది. కాబట్టి అది ఫలాలను ప్రతి relation లోనూ అందిస్తుంది.

కానీ ప్రేమ యొక్క గొప్పతనం తెలుసుకునే time కి భార్యా-భర్తల పాత్ర పోషిస్తున్న వారికి మాత్రం ఈ episode లోని విషయాన్ని అవగాహన చేసుకోవాల్సిన అవసరం వుంది.

ఇద్దరి జీవులకు వివాహమైన క్షణం నుండే వారి సహచరి అయిన ప్రేమ వారి మధ్యన నిలుస్తుంది. అది ఎవరు ఒప్పుకున్నా, ఒప్పుకోకపోయినా, గమనించినా, గమనించక పోయినా ఇద్దరి మధ్యనా నిలుస్తుంది. ఇంక ప్రేమను నిలుపుకునే పని కాదు చేయాల్సింది.

దాన్ని ఫలింప చేసుకునే పని చేయాలి.

ప్రేమ, భార్యా-భర్తల మధ్య ఫలించక పోవటానికి కారణం, పరిష్కారం :-

ఒకరు చెప్పినదే రెండో వాళ్ళు పాటించాలన్న నియంత్రణ.

నాకే నా వారు సొంతం అని ఎవరికి వారు అనుకోవటం.

పరిస్థితులు, వాతావరణం సహకరించట్లేదని నేరాన్ని వాటిపై నెట్టటం.

అన్నింటి కంటే ముఖ్యంగా ఎదుటి వారిపై పెత్తనం చేయాలని చూడటం. ఇలాంటి ఎన్నో కారణాలు భార్యా భర్తల ప్రేమని ఫలించ నివ్వవు.

మిగతా ఏ సంబంధాలలోనూ వుండే ఆశింపు కన్నా, భార్యా-భర్తల సంబంధంలో వుండే ఆశింపు కోటి రెట్లు ఎక్కువగా వుంటుంది. అంతటి ఆశింపు వల్ల తృప్తి అన్న పదమే అక్కడ వినబడదు.

తల్లితండ్రులు-పిల్లలు, స్నేహితులు ఇలా ఏ సంబంధాలలో అయినా మనం బాలేక పోయినా ఎదుటి వారు అన్నా హాయిగా వుంటే చాలు అని కోరుకుంటాడు జీవి. కానీ భార్యా-భర్తల విషయంలో నేను బాలేను కాబట్టి ఎదుటి వారూ బావుండకూడదనే స్వభావం జీవికి వచ్చేస్తుంది.

దీనికి కారణం, బంధం ఏర్పడినప్పటి నుంచీ ఒకరి బాధ్యత మరొకరిది అన్న భావమే నన్ను వదిలేసి బాగుపడి పోతున్నాడనే కంగారు.

నిజానికి ఎవరి బాధ్యతా ఎవరిదీ కాదు.

మన సహచరి అయిన ప్రేమను మనం అన్ని వేళలా ఆస్వాదించటానికి వీలుగా ఒక జీవికి మరో జీవికి సంబంధాన్ని ఏర్పరుస్తారు. తమ సహచరి అయిన ప్రేమను తమ భాగస్వామిలో నిలుపుకుని ఆ ప్రేమను ఆస్వాదించాలి కానీ భాగస్వామిని కాదు.

భాగస్వామిని ఆస్వాదిస్తే, ఆశింపు మొదలవుతుంది. అది వేరే వస్తువుగా కనిపించి స్వీకరింపురాదు. ఒకవేళ స్వీకరింపు వచ్చినా దానిని వదిలి వుండలేనంత మోహం వచ్చేస్తుంది, అభద్రత భావం అసంతృప్తి వస్తుంది.

అదే నీ సహచరి అయిన ప్రేమే నీ భాగస్వామిలో వుంచుకుని, నీ ప్రేమ రూపమే భాగస్వామిగా స్వీకరిస్తే అప్పుడు భాగస్వామి నీకు వేరుగా అనిపించరు, కనిపించరు. వేరుగా కనిపించనప్పుడు స్వీకరింపు, తిరస్కారం రెండూ వుండదు అభద్రత, అసంతృప్తి వుండవు.

ఎంత అవగాహన వున్నా, ఎన్ని విషయాలు తెలిసినా సంసారంలో వున్నప్పుడు ఏదైనా చిరాకు కలుగుతూనే వుంటుంది. ఆ చిరాకును తొలగించు కునేందుకే మన ప్రేమను మన భాగస్వామిలో వుంచుకుని ఆస్వాదించడం. కానీ భార్యా, భర్తలలో ఎవరో ఒకరు ఆ విషయాన్ని ఒప్పుకోరు పరిస్థితులు సహకరించకపోతే ఎలా ఆనందిస్తారు? ఇది వారి ప్రశ్న. ఆ పరిస్థితులలో పడి ఇబ్బంది పడుతున్న మీరు ఆనందించటమే ఉపశమనం అంటుంది సత్యం. అలా ఆనందించని మీ హృదయాలకు, మనసుకు పరిస్థితి తేలికగా కనిపించును.

అది మీకు పట్టదు అంటే విడిపోతుంది అంటుంది సత్యం.



కానీ ఎలా వున్నా ఆనందంగానే వుండాలి అన్నది చాలా మందికి చాలా నీచంగా, దుర్మార్గంగా కనిపిస్తుంది.

సృష్టిలో అన్నిటి కన్నా పెద్ద సమస్య భార్యాభర్తలే.

సృష్టిలో పోటీ దారులు భార్యాభర్తలే.

ఈ సంబంధాన్ని, దాని ఉద్దేశాన్ని, దాని ఫలాన్ని అర్థం చేసుకుంటే కానీ ఈ సమస్య తీరదు.

మన సహచరి అయిన మన ప్రేమకు రూపమే మన భాగస్వామి.

భాగస్వాములలో ఏ ఒక్కరూ మరొకరికి ఏ విధంగానూ బాధ్యులు కారు.

కాకపోతే సహజీవనం చేయడం కోసమే పనులను విభజించుకున్నారు.

ముందు ఎవరూ ఎవరికీ జవాబుదారీ కాదు. అనుకున్నప్పుడు, ఆనందించడానికే ఈ సంబంధం అనుకున్నప్పుడు ముందు ఆశింపు తగ్గుతుంది.

ఆశింపు తగ్గిన మనిషికి అవగాహన ఏర్పడుతుంది.

ఆ అవగాహనలో భాగస్వామి తన నుంచీ వేరైనది కాదుగా అర్థం అవుతుంది. ఆ అవగాహనలో భాగస్వామితో ఆనందాన్ని పంచుకోవటమే తమ సమస్యలను తేలికగా తీసుకోవడానికి మార్గంగా తెలుసుకుంటారు. పరిస్థితులను, సమస్యలను చూడక ఆనందంగా వుండేటప్పుడికి తేలిక పడ్డ మనసు, హృదయంతో జీవితం హాయిగా కనపడుతుంది.

భార్యా-భర్తల సంబంధం మానసిక ఆట, భావం

ఆ ఆటలో, భార్యా-భర్తల ఆనందకరమైన జీవితానికే ఓటు వేస్తే మొత్తం సంసారమే అంటకుండా వుంటుంది.

అలా కాక భార్యా-భర్తలు ఎక్కువ, తక్కువలు చూసుకుంటూ, పోటీ పడుతూ, ఒకరిని ఒకరు నిందించుకుంటూ వుంటే సంసారమే కానీ సుఖ శాంతులు అంటనే అంటవు.

అందరిలా భావన, ఎలా భావిస్తే అలానే కనబడుతుంది.

కాబట్టి కనబడితేనే, భార్యా-భర్తలుగా భావిస్తాను అంటే జరిగే పని కాదు. నువ్వు

ఎలా భావిస్తే అలా కనిపిస్తుంది.

అయితే తమ సహచరి అయిన ప్రేమను తమలోనే నిలుపుకుని జీవించ గలిగే సత్తా వుంటే భార్యా, భర్తల సంబంధమును క్రమం తప్పక స్వీకరించాలి అనేది లేదు. అంటే ప్రేమను అర్థం చేసుకోగల్గితే వివాహం చేసుకోవాల్సిన అవసరం లేకుండా కూడా వుండొచ్చు.

భార్యా-భర్తల ఆనందం ఇద్దరికీ సంసారాన్ని అంటనివ్వదు, సంసారా నుండీ విడుదల చేసినట్లే కాబట్టి, వివాహమూ మోక్ష మార్గమే అన్నారు. వివాహం వల్ల కూడా సంసారాన్ని అంటక వుండొచ్చని అర్థం అంతే కానీ వివాహం చేసుకోకపోతే మోక్షం రాదని అర్థం కాదు. అలాగే ప్రేమను మీలోనే నిలుపుకుని ఆనందించ గల స్థోమత వున్న జీవికి వివాహం అక్కర్లేదు. అర్థం కాకుండా భార్యా-భర్తలైనా మోక్షం రాకపోగా జీవితం భరించలేనిదిగా అవుతుంది.

ఎంత చెప్పినా అర్థం చేసుకోలేనిది. విషయాన్ని ఒప్పుకోనిది. భార్యాభర్తలే.

కాబట్టి మళ్ళీ మళ్ళీ చెప్పుకుంటున్నాం :-

భార్యా-భర్తల ప్రేమ సంసారాన్ని అంటకుండా చేసే ఆయుధం ఏది ఎలా వున్నా మనం ఆనందించటానికే ఒకటి అయ్యాం అన్న అవగాహనతో వుంటే, ఆ ఆనందంలో వుంటే ఎంతటి విషయమైనా దూది పింజెలా విడిపోతుంది. ఇందుకే భార్యాభర్తల సంబంధం కానీ ఎవరికీ ఎవరూ బాధ్యులు కారు అన్న విషయం గుర్తుండాలి.

సమాజంలో వున్న తేడాల వల్ల, స్త్రీలకు అవిద్య, చపల చిత్తం, అభద్రత, అన్నింటిలో జోక్యం చేసుకోవడం, పెత్తనం చేయడం, అవగాహనా రాహిత్యం వున్నాయి. అలాగే పురుషులకు అహంకారం, మొండితనం, అధికారాన్ని చూపాలనుకే దర్పం, మూర్ఖత్వం వున్నాయి.

ఇవి సమాజంలో పురుషుడిని యజమానిగా చేసి చూపించటం వల్ల, సంపాదనా పరుడిగా మార్చటం వల్ల వచ్చినవి. అయితే ఈ లోటు పాటులని సరిదిద్ది స్త్రీ, పురుషులు సమానమే అని నిరూపించాలి అని బయలు దేరితే వచ్చే కలాబ్దంలో అయినా విజయం వస్తుందో రాదో. కానీ విషయాన్ని అవగాహన చేసుకుంటే మార్పు instant గా వస్తుంది. ఒక్కో జంట మారే కొద్దీ. ఒక్కో కుటుంబం,



ఒక్కో ఊరు, సృష్టి అంతా ఆనందమయం అవ్వాల్సిందే కానీ సమాజంలో వున్న లోటు పాట్లు దగ్గరినించీ మొదలైతే పని పూర్తయ్యేది ఎప్పటికో.

కాబట్టి భార్యాభర్తలు దీన్ని ఒప్పుకోవటానికి ప్రయత్నించండి లేకపోతే ఎవరైనా ఒప్పుకుని ఆనందంగా వున్న వారి చూసైనా ఒప్పుకోండి. ఎవరైనా నీవల్లే అంటే నీవల్లే అని పోట్లాడు కోవాల్సిన పని వుంటే గిరిధర్‌వాణీ ఎదురుగా పోట్లాడకండి. ఇది విన్న వెంటనే చాలా మంది నేను correct గానే వున్నాను, నా partner అలా లేరు అంటారు. వాళ్ళకి సమాధానం మీరు ఈ క్షణం నుంచీ, మీ సహచరి, మీతో పుట్టిన మీ ప్రేమ యొక్క రూపమే మీ భాగస్వామిగా పూర్తిగా భావించండి. ఆ భావనని నిలపండి అదే maintain చేస్తుంది. మీ భావనే మీ భాగస్వామిని మీకు అనుకూలంగా మారుస్తుంది.

నేనే భావించాలా అంటే మరి నువ్వే కదా happy గా వుండి నీ సత్యాన్ని తెలుసుకోవాల్సింది. నేనే ఎందుకు చేయాలి అంటే అర్థం చేసుకునే ఇంకితం నీకే వుందిగా.

ఇంకో రహస్యం, భార్యా-భర్తలు ఒకరిపై ఒకరు మోపే నిందలు భగవంతుడు పట్టించుకోక పోగా "నీకు ఆ పిచ్చి వదిలే వరకూ నీకూ నాకూ సంబంధం లేదు" అంటారు.

అసలైనా భార్యా-భర్తల గురించి ఇంత ఎందుకు విశ్లేషించాలి. వారు happy గా వుంటే → కుటుంబం → సమాజం happy గా వుంటుంది అంతే కాక.

మనిషి self progress ని ఆపేసే ఏకైక బంధం ఇదే. మిగతా అన్ని సంబంధాలలో ఎంతో కొంత progress అవుతారు. ఒక పక్షం వారు కాకపోతే ఇంకొకరు అన్నా progress అవుతారు. కానీ భార్యా-భర్తలు ఒకరు progress అయితే రెండో వారు అర్థంకాక దానిలో నుంచి బయటపడే దాకా ఊరుకోరు కాబట్టి ఇద్దరూ కలిసి progress లోకి వెళ్ళాల్సిందే. సంసారంలో వున్నా, అంటకుండా వుండే అద్భుత సాధనం భార్యా-భర్తల ప్రేమ, సంసారం అంటక పోతే మిగిలేది నువ్వే (self) అది చైతన్యంలోకి రావటమే కదా నీ జీవితానికి శుభము.

అందుకే పెళ్ళి మోక్ష సాధనం అన్నా, భార్య, భర్తల మీద పురాణాలు రాసిన అర్థం కాలేదు. కాబట్టే ఇలా విశ్లేషిస్తున్నాము.

భార్యా-భర్తల విషయాన్ని అర్థం చేసుకుంటే,

ఒకరి పట్ల ఒకరికి గౌరవం,

ఒకరి పనులు ఒకరు పంచుకోవడం,

ఒకరి అభిప్రాయాన్ని ఒకరు ఆమోదించడం,

ఒకరి ప్రయత్నానికి ఒకరు సహకరించటం లాంటి పనులు సహజంగా జరిగిపోతాయి. కానీ ఇవన్నీ నేర్చుకుని, ఆ ఆదర్శాలను అలవాటు చేసుకుంటే ప్రేమ ఫలించదు.

వివాహమూ మోక్ష సాధనం అన్నారు.

100 మంది 99 మంది వివాహం చేసుకుంటున్నారు.

99 వివాహాలలో 98 అసంతృప్తి కరంగా వుంటున్నాయి కాబట్టి, వాటి ద్వారా మిగతా సంబంధాలు, జీవులు అందోళనలోకి వెళ్ళి, జీవిత లక్ష్యాన్ని మరచిపోతున్నారు కాబట్టి దీనిని పెద్ద సమస్యగా పరిష్కరించి విశ్లేషించడం జరుగుతోంది.

ఇదీ ఆధ్యాత్మికమే. ఆత్మ, పరమాత్మ అని ఎన్ని రహస్యాలు చెప్పినా నీకు మనసు కుదురు లేనిదే ఎలా అన్వయించుకుంటావు. అందుకే నీ భాగస్వామి తప్పొప్పులు నీ నోటితో తుడవటం మానేసి, నీ ప్రేమ రూపంగా భావించి, నువ్వు మాత్రమే ప్రేమిస్తూ returns ఆశించక, వుంటే ఆనందం, శాంతి ఏర్పడి నీ జ్ఞానం విజ్ఞానమై నిన్ను పునీతులను చేస్తుంది. అంతేకాక అప్పుడు నువ్వు కోరుకున్న ప్రేమ, ఆనందం, గౌరవం నీకు నీ భాగస్వామి నుండీ లభిస్తాయి.

ఒప్పుకో - ఆనందించు

ఒప్పుకోకపోతే - దుఃఖించు కానీ నాకు ఆ దుఃఖాన్ని అంటించాలని చూడకు "దేవుడా" ! అని పిలిచి.

నేను ఆనందాన్నే చూస్తాను. నేను దుఃఖాన్ని చూడాలనుకున్నా నాకు కనబడదు. నీ అవగాహన రాహిత్యం వల్ల నీకు వచ్చిన దుఃఖం నీకే సొంతం.



## గురు శిష్యుల మధ్య ప్రేమ - మూడవ రోజు

తల్లితండ్రులు - పిల్లల మధ్య ప్రేమను, భార్యా - భర్తల మధ్యన ప్రేమను ఫలింప చేసుకున్న జీవికి ప్రతిదీ సాధ్యమే. అంటే ప్రతీ సంబంధంలోనూ ప్రేమను ఫలింపచేసుకుంటుంది.

అలాకాక ప్రేమ యొక్క గొప్పతనము ఒక గురువును ఆశ్రయించిన తర్వాత మొదటిసారిగా తెలిసినప్పుడు. గురు-శిష్యుల ప్రేమను ఎలా ఫలింప చేసుకోవాలో తెలుసుకోవాలి. దాని ద్వారా మిగతా జీవితాన్ని 'ప్రేమ' మయం చేసుకోవచ్చు.

తల్లితండ్రులు - పిల్లల మధ్య ప్రేమను ఫలింప చేసుకోవాలంటే తల్లితండ్రులకు ఎక్కువ అవగాహన వుండాలి అనుకున్నాము.

అలాగే భార్య-భర్తల మధ్య ప్రేమను ఫలింప చేసుకోవాలంటే ఇద్దరికీ అవగాహన వుండాలి అనుకొన్నాము.

అలాగే గురు-శిష్యుల మధ్య ప్రేమను ఫలింప చేసుకోవాలంటే శిష్యునికి ఎక్కువ అవగాహన వుండాలి. అయితే ఆ అవగామన కలిగించే బాధ్యత మాత్రం గురువుదే అవుతుంది.

శిష్యుడు తన యొక్క అవసరం కోసం గురువును ఆశ్రయిస్తాడు.

గురువు తనను ఆశ్రయించిన శిష్యునకు చేయాల్సిన ఏకైక బోధ :-

"ఆశ్రయించిన శిష్యుడు యొక్క విశ్వాసాన్ని, ప్రేమలో కలుపుకుని ఆ ప్రేమనే గురు-శిష్యుల మధ్యన నిలపాలి" అన్నదే.

సహజంగా గురువులు యజ్ఞాన్నో, యాగాన్నో, యోగాన్నో, ధ్యానాన్నో, మంత్రాన్నో శిష్యులకు ఉపదేశిస్తారు. అవి ఫలిస్తాయని, వారి లక్ష్యానికి చేరుస్తాయని ఉద్ఘాటిస్తారు.

కానీ నిజానికి ఫలించేది. ఫలితాన్ని ఇప్పించేది ఆ శిష్యునికి గురువుపై కల ప్రేమ మాత్రమే కానీ ఆ సాధనా ప్రక్రియ కాదు. శిష్యుడు గురువుపైన ఉన్న విశ్వాసంతో, గురువు ఆజ్ఞకు తన సందేహాన్ని, సంశయాన్ని, ఆశయాన్ని, ఆశను

అడ్డు రానివ్వడు. అలా శిష్యునిదైన ఏ విషయమూ గురువుకు అడ్డు వేయక పోవటంతో, గురు-శిష్యుల మధ్య వారి సహచరి అయిన ప్రేమే నిలుస్తుంది. అలా నిలిచిన ప్రేమే శిష్యునికి ప్రయత్నానికి ఫలాన్ని ఇస్తుంది. కానీ ప్రయత్నం ఫలించట్లేదు.

గురువు ప్రేమ లేకుండా సాధనా ప్రక్రియలో నిష్ణాతులైన శిష్యులకు తృప్తి వుండదు. ఉదాహరణకు గురువుపై ప్రేమ లేకుండా యోగాన్ని పూర్తిగా నేర్చుకుని అదిష్ఠించినా తృప్తి వుండదు. వేరే ఏదో అన్వేషణ జరుపుతూనే వుంటుంది జీవి.

అలాగే శిష్యునికి గురువుపై ప్రేమ వుంటే, ఆ ప్రేమ వల్ల సాధనా ప్రక్రియ పూర్తి స్థాయిలో అందకపోయినా ఫలం మాత్రం అందుతుంది.

కాబట్టి గురు-శిష్యుల మధ్య తమ సహచరి అయిన ప్రేమను నిలబడనిస్తే చాలు అదే ఫలిస్తుంది.

అలా ఫలించిన ప్రేమ శిష్యుని, గురువును మించిన వారిగా చేస్తుంది. అంటే గురువుకు కూడా ఇంకా అందని స్థితిని ఇప్పిస్తుంది.

అందుకే శిష్యుడు గురువును పూర్తి స్థాయిలో అన్నీ తెలిసిన వారిగా విశ్వసించాలి. అలా విశ్వసించిన శిష్యుడి ఏ విషయమూ గురు-శిష్యులకు మధ్య నిలవక పోవటంతో ప్రేమ నిలిచి ఫలాన్ని అప్పగిస్తుంది. శిష్యుడు గురువుని విశ్వసిస్తే చాలు ప్రేమ అదే నిలిచి ఫలిస్తుంది.

అలాగే గురువు కూడా "శిష్యుని ఉద్ధరించేది, ఫలింప చేసేది ప్రేమే కానీ నేను కాదు" అని గుర్తించాలి. అలా గుర్తించిన గురువు, శిష్యుని అణచాలని, లొంగ దీసుకోవాలని ప్రయత్నం చేయరు. అధికారాన్ని ప్రదర్శించరు.

ప్రేమే అన్ని పనులు చేసి శిష్యునకు ఫలాన్ని ఇప్పిస్తున్నప్పుడు గురువు యొక్క ఆవశ్యకత ఏమిటి?

వివాహ విషయంలో కూడా, ప్రేమను తమలో నిలుపుకుని సహచరించ గల్గితే వివాహం అక్కర్లేదు అన్నారుగా.



అలాగే ప్రేమే మనకు ఫలితాన్ని ఇప్పించేటప్పుడు గురువు ఆవశ్యకత ఏంటి? అన్న సందేహాలు రావడం సహజం.

నిజానికి ప్రేమే ఫలించేటప్పుడు గురువు అక్కర్లేదు.

కానీ ఆ ప్రేమను ఆధ్యాత్మికంగా ఫలించటానికి వాడుకోవచ్చని ఆ ప్రేమ ఇలాంటి ఫలితాలను ఇప్పిస్తుందని తెలుపటానికి అయినా గురువు కావాలి కదా, కాబట్టి గురువుని ఆశ్రయించి తెలుసుకోవాలి అలా తెలుసుకున్న తర్వాత ఇక ప్రేమ ఫలించటం మొదలు పెడుతుంది. ఆ ప్రేమ శిష్యునికి గురువును తనదైన ప్రేమగానే పరిచయం చేస్తుంది. ఆ ప్రేమ శిష్యునికి గురువును తనలోపల, బయట చూపిస్తూ వుంటుంది. అలా శిష్యుడు, గురువుతో విడదీయక ఉంటారు. అంతేకానీ గురువు దగ్గరే శిష్యుడు పడి శుశ్రూష చేయాలని, పడిగాపులు కాయాలని, అన్నీ త్యాగం చేయాలన్నది సత్యం కాదు.

అలాగే గురువు కూడా శిష్యుని ఉన్నత భావంతో చూస్తూ, తమ మధ్య ప్రేమ నిలిచేలా చూస్తే ఆ ప్రేమే ఫలించి శిష్యుని ఉద్ధరించి, ఆ ఉద్ధరింపు యొక్క కీర్తిని తనకు ఆపాదించబడుతుంది. అని గుర్తించాలి.

లేదంటే గురువు కూడా అనేక శిష్యుల బంధాలను తనపై వేసుకుని, వారి ఉద్ధరింపు జరిగే దాకా బంధిపబడి వుంటారు.

అందుకే గురువు, శిష్యుని గోల్ పొందలేదని నిరుత్సాహ పరిచి చులకన చేయకూడదు. "నువ్వు గోల్ పొందలేదు" అని నిరుత్సాహపరిస్తే పొందించే బాధ్యత గురువుది అవుతుంది.

కొంత మేరకైన బంధాలలో ఇరుక్కున్నట్లే కదా.

అలాకాక శిష్యుని విశ్వాసాన్ని ప్రేమలో నిలిపే ప్రయత్నం చేస్తే ఆ శిష్యుడు ఫలాన్ని ప్రేమ ద్వారా పొందుతాడు.

దానివల్ల గురువుకు ప్రయోజనం వుంది. ఎలా అంటే గురువు యొక్క ప్రేమ 100 యూనిట్స్ వుంటే, తనను ఆశ్రయించిన శిష్యుని ప్రేమ ఫలిస్తే అదో 100

యూనిట్స్ వుంటుంది. ప్రేమ ఎవరిదైనా ఒకటే కదా అంటే ఆ ప్రేమ 200 యూనిట్స్ అవుతుంది. అలా ఒక్కో శిష్యుడు పలిస్తున్న కొద్దీ ఒక్కో 100 యూనిట్స్ ప్రేమ reading పెరుగుతుంది. అలా పెరిగిన ప్రేమ గురువుది. ఆప్రేమే శిష్యులది. ఎ అనే శిష్యుడి ఒక్కడికీ ప్రేమ 100 యూనిట్స్ వుంటే గురువుకు already మిగతా వారివల్ల 1000యూనిట్స్ వుంటే ఆ ఎ అనే శిష్యుడి ప్రేమ 1,100 యూనిట్స్ అవుతుంది కదా.

అలా శిష్యునికి ప్రేమ మరింతగా పెరగాలన్నా, గురువుకీ ప్రేమ మరింతగా అందాలన్నా గురు-శిష్యులు ఇద్దరూ ఒకరికి ఒకరు అవసరమే.

అవధులు లేకుండా ప్రేమను పూర్తిగా పొందిన శిష్యుడే గురువు, అంటే అవధులు లేకుండా ప్రేమను పెంచుకున్న గురు శిష్యులు ఇరువురూ ఒక్కటే ఇరువురూ ఒకటే అయినప్పుడు ఎవరి మీద ఎవరు పెత్తనం చలాయిస్తారు?

కాబట్టి ఇలా గురు-శిష్యుల బంధం ఇరు వర్గాల వారివీ అవధులు లేకుండా పెంచుతుంది.

అదే భార్యా-భర్తలలో అలా అవధులు లేకుండా ప్రేమ పెరిగే అవకాశం లేదు కాబట్టి, ఒక భార్య ఒక భర్త కాబట్టి (200 యూనిట్స్) వివాహం చేసుకోక పోయినా పర్లేదన్నారు.

కానీ అవధులు లేకుండా పెరిగేది గురు-శిష్యులు బంధం కాబట్టి దాని అవసరం ఎంతైనా వుంది.

అవధులు లేకుండా ప్రేమను పెంచుకుని, అనంతంగా ఎదిగే శిష్యుడు లేని గురువు ఎప్పటికీ బంధ వియుక్తుడు కానేరడు అనంతంగా ఎదిగిన శిష్యుడి వల్లే గురువుకీ అనంతమైన శోభ.

ఇలా గురు-శిష్య బంధాన్ని ఇరు వర్గాల వారు ఉపయోగించుకుంటే దానికి అర్థం.



## భగవంతుడుకి భక్తుడికి మధ్యగల ప్రేమ - నాల్గవ రోజు

<u>భగవంతుడికి భక్తుడికి మధ్యగల ప్రేమలో తెలుసుకోవాల్సిన విషయాలు :</u>

ఈ సంబంధంలో తెలుసుకోవాల్సిన విషయాలు చాలా సున్నితంగా వుంటాయి. అర్థం చేసుకోవటానికి కొంచెం మింగుడు పడనివిగా వుంటాయి. తెలిసిన విషయాలే కానీ ఒప్పుకోవటానికి మనస్కరించదు.

భక్తుడు తన రక్షణ కోసమో, సహాయం కోసమో, అవసరము కోసమో, మరేదన్నా ఆసక్తితోనో భగవంతుడిని ఆశ్రయిస్తాడు.

భగవంతుడు భక్తుడికి తన భావనలో దొరుకుతాడు మొదటిగా

అంటే భగవంతుడు ఒకడు వున్నాడు అని భావించి ఆ భావనలోనే జీవిస్తుంటాడు. తను "ఉన్నాడు" అని నమ్మిన భగవంతుడిని ఒక రూప, నామాలతో పూజిస్తుంటాడు. అలా భక్తి చేసుకుంటున్న భక్తుడు తనకు కలిగిన ప్రతీ లాభం తన ఇష్ట భగవంతుడి వల్లే జరుగుతుందని నమ్ముతుంటాడు. తను ఆరాధించే భగవంతుడు విగ్రహ రూపధారి, నిజంగా కనబడడు. కానీ భక్తుడు ఆ భగవంతుడిని తన భావంలో, తన లాభంలో దర్శిస్తుంటాడు. కీర్తిస్తుంటాడు.

ఇలా పుట్టిన ప్రతి జీవి కూడా భగవంతుని ఏదో ఒక రూపనామాలతో తన భావంలో దర్శిస్తూ తన జీవితం చివర దశ దాకా గడుపుతాడు పరమ భక్తులు కొందరు తమ భగవంతుని, తాము ఇష్టపడిన నామ రూపాలుగానే పొంది వారిలో ఐక్యం అయ్యారనీ మనకు పురాణాలు చెప్తున్నాయి. ఇదే భగవంతుడు భక్తుడికి మధ్య గల ప్రేమకి ఫలం అన్నట్లు కూడా చెప్తారు.

అయితే ఈ విషయాన్ని శాస్త్రీయంగా సత్యపరంగా అర్థం చేసుకుంటే మనకు ఈ క్రింది విషయాలు బోధపడతాయి.

భగవంతుడు అంటే Ultimate Energy and Absolute Truth (శక్తి, సత్యం) ఇది ఎక్కడ వుండేది అంటే ప్రతి జీవిలోనూ శక్తి, యుక్తులుగా వుంటాయి.

అంటే భగవంతుడు అంటే జీవిలోని దివ్యత్వము

భక్తుడు అంటే జీవి.

వీరి మధ్యన వున్న ప్రేమ ఎలా ఫలిస్తుందో తెలుసుకుందాం.

జీవి పుట్టుకతో పాటు తన సహచరి ప్రేమను కలిగి వుంటాడు.

అలాగే తనలో దివ్యత్వాన్ని కలిగి వుంటాడు. తన సహచరి అయిన ప్రేమ, తనలో దివ్యత్వాన్ని కలిగి వుంటాడు. తన సహచరి అయిన ప్రేమ, తనలో దివ్యత్వానికి, తనకు మధ్య సంబంధాన్ని ఏర్పరుస్తూ, రెండిటి మధ్య దూరాన్ని తగ్గిస్తూ జీవిని భగవంతుడిలో అంటే తనదైన దివ్యత్వంలో నిలుపుతుంది.

అయితే ఇక్కడ ముందుగా అర్థం చేసుకోవాల్సిన విషయం ఒకటి వుంది. అది ఏమిటంటే

జీవి పుట్టుకతో పాటే ప్రేమను, దివ్యత్వాన్ని రెండింటినీ కలిగి వున్నాడు. కానీ ప్రేమనే సహచరి అంటున్నాము. అంటే జీవి ఏ దశలో వున్నా అతనితో చరించేది ప్రేమ. అంటే అసుర లక్షణాలు, జీవ లక్షణాలు, దైవ లక్షణాలు ఇలా ఏ లక్షణాలతో ఒప్పుతున్నా కూడా జీవితో పాటు అతని ప్రేమ సహాయంగా చరిస్తుంది. కానీ దివ్యత్వం అలా కాదు. జీవి అసుర లక్షణాలను exhibit చేస్తుంటే దివ్యత్వం కుచించుకు పోతుంది. నిజ పద్ధతిలో వున్న జీవికే దివ్యత్వం తోడుగా సంచరిస్తుంది. అందుకే ఎలాంటి పరిస్థితులలో అయినా ఎలాంటి దశలోనైనా జీవికి తోడుండేది ప్రేమ కాబట్టి, ప్రేమనే జీవి యొక్క నిరంతర సహచరి అన్నాం.

పుట్టిన జీవితో, ప్రేమ, దివ్యత్వం రెండూ సమానంగా మొదలు అవుతాయి కానీ జీవికి నిరంతర సహచరి మాత్రం ప్రేమే.

ఇక ప్రస్తుత విషయానికి వస్తే :-

భగవంతుడిని (తన దివ్యత్వానికి) కి జీవికి అనుసంధానం కలిగిస్తూ వుంటుంది. ప్రేమ.

ప్రేమ, తొలుత జీవి యొక్క పనులను విజయవంతంగా పూర్తి చేస్తూ వుంటుంది. భక్తుడు అది తన భగవంతుని మహిమ వల్ల జరిగింది అనుకుంటాడు. తను భగవంతుడిగా నమ్ముతున్న రూప నామాల మీద విశ్వాసాన్ని పెంచుకుంటాడు. క్రమంగా తన ధ్యానలో తన భగవంతుడిని ఎక్కువగా నిలుపుతుంటాడు.

ధ్యానలో ఆ భగవంతుడికి మరింత చేరువ అవుతున్నాను అనుకుంటాడు కానీ నిజానికి అతడు చేరువయ్యేది తనలోని దివ్యత్వానికి. అంటే క్రమేణా తన దివ్యత్వము పెరుగుతూ వుంటుంది. మరింత విపులంగా చెప్పాలంటే దివ్యత్వం



వాడుకలోకి వస్తుంది. అప్పుడు భక్తుడి పనులు ప్రేమ కాక దివ్యత్వం చేస్తూ వుంటుంది. భక్తుడు తనదైన దివ్యత్వం యొక్క hand over లోకి వెళ్ళేదాకా ప్రేమే భక్తుడి పనులను చూస్తుంది, చేస్తుంది.

దివ్యత్వం hand over చేసుకున్న తర్వాత కూడా 'ప్రేమ' భక్తుడికి సహచరిగానే వుంటూ వుంటుంది.

దివ్యత్వం hand over లోకి క్రమేణా వెళ్తున్న భక్తుడు సంసారంలో వున్నందున పరిస్థితుల ప్రభావం వల్ల దాని grip నుండి చేజారే అవకాశం లేకపోలేదు.

అలా చేజారిన క్షణంలోనే, ప్రేమ తన చేతులలోకి తీసుకుని భక్తుడి పనులను చేస్తూ వుంటుంది. తిరిగి భక్తుడికి వాని దివ్యత్వానికి మధ్యన అనుసంధానాన్ని కలుగ చేస్తూ వుంటుంది. మళ్ళీ తన దివ్యత్వంలోకి భక్తుడు పయనించేదాకా పని చేస్తూనే వుంటుంది. భక్తుడు తన దివ్యత్వాన్ని ఆస్వాదిస్తున్నప్పుడు కూడా "ప్రేమ" కూడా 'కూడా' చరిస్తూ దివ్యత్వాన్ని ఆస్వాదిస్తుంది.

ఇక్కడ ఎవరికైనా ఒక సందేహం రావచ్చు.

"దివ్యత్వం ఆధీనంలోనికి వెళ్ళిన జీవి తిరిగి ఎలా పక్కదారిన పడుతుంది" అని ఎవరికైనా సందేహం రావచ్చు.

దివ్యత్వం అంటే వేరే ఏదో కాదు. జీవి తన సైన్యాన్ని వాటంతట అవి పనులు చేసుకోనివ్వటమే (సైన్యం అంటే let it work లో విశ్లేషించినవి) అలా వాటంతట అవి పని చేస్తుంటే వచ్చే విజయాలను దివ్యంగా ఆనందించటమే జీవి పని. అలా వాటంతట అవి పని చేయకుండా జీవి వాటిలో కల్పించుకుని పనిని, ఫలాన్ని ఆలస్యం చేసుకోవటమే దివ్యత్వంలో నుంచి బయటకు రావటం అలా దివ్యత్వంలో నుంచి బయటకి వచ్చిన జీవికి "ప్రేమ" సహాయం చేసి పనులు చేస్తుంది. తిరిగి దివ్యత్వం ఆధీనంలోకి జీవి వెళ్ళే దాకా సేవలు చేస్తూనే వుంటుంది.

ఇలా జీవి తన జీవిత కాలంలో ఎన్ని సార్లు ముందుకు వెళ్ళి వెనక్కు వస్తాడో అన్ని సార్లు 'ప్రేమ' ఆదుకుని ముందుకు నడిపిస్తూనే వుంటుంది.

కొంత మేరకు దివ్యత్వం ఆధీనంలోకి వెళ్తుండటం అలవాటైన భక్తుడికి, ప్రేమ కాపలా మరింతగా కాస్తుంది.

దివ్యత్వానికి సరిపడని పనిని భక్తుడి చేత ఎట్టి పరిస్థితులలో చేయనీయదు "ప్రేమ" భక్తుడు తెలియక పక్కదారి పడుతున్నా ప్రేమ అలా జరగనీయదు.

క్రమేణా భక్తుడు నిజ పద్ధతిలో నడుస్తుంటాడు.

సత్యంలోనే జీవిస్తుంటాడు అదీ అతని ప్రమేయం లేకుండా అంటే ఏది నిజమో భక్తుడు విశ్లేషించి నిర్ణయించుకోవాల్సిన పని లేకుండానే నిజంలో బతికేస్తుంటాడు.

ప్రయత్నించినా తప్పు చేయలేడు. ప్రేమ అలా కాపాడుతుంది. ఖచ్చితంగా దివ్యత్వానికి సరిపడేలాగా ప్రవర్తిస్తాడు భక్తుడు తన సహచరి అయిన ప్రేమ సంరక్షణలో. అలా ప్రేమ సహాయంతో ఒక రోజుకి పూర్తిగా భక్తుడు దివ్యత్వం ఆధీనంలోకి వెళ్ళిపోతూ వుంటాడు. ఎంతగా దివ్యత్వం ఆధీనం చేసుకుంటుంది అంటే తిరిగి భక్తుడు వెనుక అడుగు వేయలేనంత. అంతగా ఆధీనం చేసుకునే దాకా ప్రేమ కాపలా కాస్తూనే వుంటుంది భక్తుడికి.

అంటే ఇక భక్తుడు పూర్తిగా తన సైన్యాన్ని వాటంతట అవి పని చేయనిస్తూ వుంటాడు. ఫలాన్ని ఆనందిస్తాడు. అంటే పని ఫలం రెండూ తనలోనే జరుగుతున్న అనుభూతిని పొందుతాడు. తద్వారా సమస్తమూ తనలోనే జరుగుతుందని తెలుసుకుంటాడు. అలాగే అంతా తనకు సానుకూలంగా, తన బలంతోనే జరుగుతున్నట్లు అనుభవిస్తాడు. తద్వారా సమస్తంలోనూ తనే వున్నట్లు తెలుసుకుంటాడు భక్తుడు ఎంతగా ఈ దశలో ఎదుగుతాడంటే, పూర్తిగా తన దివ్యత్వంతో ఏకమై, తిరిగి విడదీయలేనంతగా సమేక మవుతాడు.

అంటే భక్తుడే భగవంతుడు అవుతాడు, పూర్తిగా భగవంతుడే కనబడతాడు కానీ భక్తుడు కనబడడు.

అలా ప్రేమ భక్తుడిని, భగవంతుడిగా మార్చే వరకు పని చేస్తూనే వుంటుంది. ఇలా భక్తుడు భగవంతుడు అయిపోతాడు. అలా అయిపోయిన భగవంతుడికీ నిరంతర సహచరి ప్రేమే.

అప్పుడు భక్తుడు భగవంతుడుగా, ప్రేమ భక్తుడిగా వుండి ఒకరి నొకరు ఆనంద పరుచుకుంటూ సదా జీవించే వుంటారు.

ఇలా 'ప్రేమ' తను భగవంతుడితో ఆనందించటానికి, భగవంతుని ఆనంద



పరచటానికి ప్రతీ భక్తుడి వద్ద ప్రయత్నిస్తూనే వుంటుంది. అసలు రహస్యమే మంటే "ప్రేమ" కూడా దివ్యత్వంలోనిదే.

దివ్యత్వం ఒకకొనకి వస్తే ప్రేమ అయితే మరో కొనకి వస్తే సత్యము.

ఈ ప్రేమ, సత్యము రెండూ భక్తుడికి అలవడితే కానీ దివ్యత్వంలో సదా అది, అంతాలను జయించి సంచరించవచ్చు.

ఆ దివ్యత్వమే ఒక వైపు ప్రేమలా నిలబడి ముందు నెట్టి మరో వైపు సత్యంలా నిలబడి స్వీకరిస్తుంది.

ప్రేమ మొత్తాన్ని సహిస్తుంది కానీ సత్యం సత్యాన్నే వరిస్తుంది.

కాబట్టి ప్రేమ ముందు భక్తుడిని సత్యంలో నిలబెట్టి సత్యంగా (భగవంతుడిగా) మారుస్తుంది. అలా మారిన సత్యంతో జత కూడి ఆనందిస్తుంది ప్రేమ.

అందుకే ప్రేమే దైవం అన్నారు.

మనల్ని మన సత్యంలో నిలబెట్టేది ప్రేమే.

నిన్ను నిన్నుగా నిలబెట్టేది ప్రేమ. కాబట్టి ప్రేమే దైవం.

ప్రేమతోనే జత కడతాడు.

ఇక్కడ భక్తుడు భగవంతుడుగా మారడం పై ఎవరికైనా సందేహం వుంటే వారి కొరకు విశ్లేషణ :

భక్తుడు కేవలం నామ మాత్రంగా వుంటాడు. పనులన్నీ అతని సైన్యం (దివ్యత్వం) వాటంతట అవే సత్య ప్రకారం నడిపిస్తూ వుంటాయి. తద్వారా భక్తుడికి నిత్యమూ సుఖం, ఆనందం లభిస్తుంటాయి. భక్తుడు కేవలం exist అవుతుంటాడు. అదీ తన నిత్య సుఖాన్ని, ఆనందాన్ని అనుభవించటానికే. ఇలా కేవలం ఉన్నామన్న ఉనికి కలిగి ఆ ఉనికిలోను సుఖైకానంద స్వరూపంగా వుండే వారే భగవంతుడు కదా. అలా వున్న వారికి తెలియనిది లేదు. రానిది లేదు. కానిది లేదు. అలా భక్తుడు తెలియని స్థితి నుంచి తెలిసే స్థితికి, తెలిసే స్థితికి

రాని స్థితి నుంచి రాలే స్థితికి

కాని స్థితి నుంచి "కానీయి" అని order వేసే

స్థితికి మారడమే భగవంతుడిగా మారడం.

ఈ "ప్రేమ" ఇలా భక్తుడిని భగవంతుడిగా మారుస్తుంది.

ఈ "ప్రేమ" లేకుండా ఏ సాధన చేసినా పూర్తి స్థాయిలో ఆ సాధన సత్య ప్రకారం వుండదు. ఎందుకంటే భగవంతుడి ఒకవైపు ప్రేమలా కనిపిస్తే మరో వైపు సత్యంలా కనపడతారు. అంటే సత్యం విషయం ప్రేమకే తెలుస్తుంది. కాబట్టి ప్రేమ లేకపోతే సత్యం తెలీదు దానివల్ల జీవి మార్పు చెందచ్చు ఏమో కానీ ఆదీ అంతాలను రుచి చూసి, జయించ గల్గేంతగా మార్పురాదు. అది కేవలం ప్రేమ వల్లే.

భక్తుడు భగవంతుడిగా మారి, ప్రేమ తోడు చేసుకుని జీవిస్తే

ఆ జీవే నిత్యజీవి

ఆ జీవే సత్యము

ఆ జీవే ప్రేమ

ఆ జీవే భగవంతుడు

"నన్ను నన్నుగా నిల్పి, నువ్వు నువ్వుగా వుండి ఆనందించు" అని మనం చేసే ప్రార్థనలో నన్ను నన్నుగా వుంచు అంటే నన్ను నా దివ్యత్వంలో వుంచు అని అర్థం. నువ్వు నువ్వుగా వుండు అంటే నువ్వు ప్రేమగా, సత్యంగా వుండు. అప్పుడు ఆ ప్రేమ, దివ్యత్వంలో నిలబడ్డ భక్తుడు వాడిని సత్యం ఆనందీ, భగవంతుడు ఆనందీ ఇద్దరూ కలిసి ఆనందిస్తారు. (1-1) ఈ మొత్తంలో గమనించాల్సింది సత్యము, ప్రేమ, దివ్యత్వము మూడు వేరైన వస్తువులు కాదు. ఒకే వస్తువు యొక్క మూడు పనులు. వేరైనది భక్తుడే. అతడే ఈ దివ్యత్వంగా మారి సత్యంలో నిలిచి ప్రేమను ఆస్వాదిస్తాడు.

ఇలా భక్తుడు - భగవంతుడి మధ్య ప్రేమ ఫలిస్తుంది.

అలాంటి ప్రక్రియ విజయవంతం అయినప్పుడే సత్యం పూర్తిగా బయటకు వస్తుంది. సత్యంలో నిలబడ్డ వారి ద్వారానే కదా పూర్తి మర్మాలు బయటపడేది. అప్పుడే లోక కళ్యాణం జరిగేది. ఆ ప్రక్రియ విజయవంతం అయింది కాబట్టే, మర్మాలు బయటకు వస్తున్నాయి అంటే జరుగుతోంది జన కళ్యాణమే. ప్రతి జీవికి వారి సహచరి అయిన ప్రేమతో జత కుదరటమే జన కళ్యాణం.



## స్నేహితుల మధ్యన ఉండే ప్రేమ - ఐదవ రోజు

స్నేహితులు అంటే హితము కోరేవారు అని మన అందరికీ తెలుసు.

ఒకరి మంచిని కోరుకో కలిగే స్థాయికి ఒక సాధారణ జీవి వచ్చిందంటే అది ఆ జీవి యొక్క సహచరి అయిన 'ప్రేమ' వల్లే కదా!

మరి 'ప్రేమ' వల్లే ఒక జీవి మరో జీవి హితం కోరుతున్నాడు అనుకుంటే అందరూ ఆ జీవికి స్నేహితులే అవ్వాలి కదా.

కానీ అలా జరగట్లేదు.

ఏ మనిషికైనా స్నేహితులు అందునా నిజ స్నేహితులు కొందరే వుంటున్నారు. జీవి సహచరి అయిన ప్రేమ వల్లే స్నేహం కుదురితే, ఆ ప్రేమ అందరితో స్నేహాన్ని కుదర్చాలి కదా. అన్న ప్రశ్న అందరికీ కలుగవచ్చు.

ముందు దానికి వివరణ తెలుసుకుంటూ స్నేహితుల మధ్య ప్రేమ ఎలా ఫలిస్తుందో తెలుసుకుందాం.

స్నేహితుడు : జీవికి తన జీవితంలో ఎదురయ్యే ప్రశ్నలకు ముందస్తుగా దొరికే సమాధానం.

ఏ జీవినైనా ఒకలాంటి మానసిక స్థితి వుంటుంది.

తన Metal status లో జీవించే జీవి ఎవరి వద్దనైనా "సమాధానాన్ని" పొందడానికి సంశయిస్తాడు. అహం అడ్డువస్తుంది.

కాబట్టి ఆ జీవి యొక్క సహచరి అయిన ప్రేమ, ఆ జీవి యొక్క మానసిక స్థితికి సరిపడేలా వ్యవహరిస్తూ స్నేహితుడిని ఎంచుకుంటుంది.

ఏ జీవికైనా సహచరి అయిన ప్రేమ, లోనున్న దివ్యత్వం ఒకలాగే వుంటాయి. వారి మానసిక స్థితి మాత్రమే జీవి నుంచీ జీవికి వేరుగా వుంటుంది.

జీవికి తన జీవితంలోదురవ్వబోయే ప్రశ్నలకు తగ్గ సమాధానం,

సమస్యలకు పరిష్కారం, తెలివికి ప్రోత్సాహం అందించ గల శక్తి ప్రేమకు వున్నా అది 3rd Party గా జీవికి స్నేహితుడిని ఇస్తుంది.

ఎందుకంటే ప్రేమకు రూపం లేదు కాబట్టి ఆ సమాధానాలు, సలహాలు, ప్రోత్సాహాలు జీవికి లోనుండే అంతర్లీనంగా అందిస్తుంది.

జీవి అది తన సొంత అవగాహనగా అనుకుని దానిని అన్వయించు కోవటానికి తటపటాయిస్తుంటారు.

వాటి confirmation కోసం జీవి యొక్క ప్రేమ స్నేహితుడిగా ఎదురు అవుతుంది.

ఆ ప్రేమకు తను exhibit కావటానికి ఎక్కడ స్వేచ్ఛ వుంటుందో, ఎవరకు తనకు అడ్డురాకుండా వుంటారో చూసి వారి రూపంలో స్నేహితుడిగా ఎదురువస్తుంది.

అందుకే మనం లోకంలో చాలా చోట్ల వీళ్ళిద్దరికీ స్నేహం ఏంటి అని ఆశ్చర్య పోతుంటాం. అంటే అక్కడ వయసు తేడానో, హోదా తేడానో, కుల మత తేడాలో, అంతస్తుల తేడాలో మనకు కొట్టవచ్చినట్లు కనబడతాయి. వారి స్నేహం మన ఊహాకి అందదు. మొరటి వాడికీ సున్నితవు మనసు గలవాడికీ స్నేహం ఏమిటని ఆశ్చర్యపడుతుంటాం. కొన్ని చోట్లా మనం ఒప్పుకో కలిగేలా కూడా ఉంటుంది అనుకోండి.

అంటే ప్రేమ ఈ అడ్డులను ఏదీ చూసుకోదు, తన ప్రభావం తన జీవి మీద పడటానికి ఏ జీవి సహకరిస్తుందో ఆ జీవినే స్నేహితుడిగా ఎంచుకుంటుంది.

కొందరూ పుట్టినప్పటి నుంచీ కలిసే వున్న స్నేహం కలగదు.

ఎందుకంటే ప్రేమ తన ప్రభావాన్ని అక్కడ ఒక జీవి నుండీ రెండో జీవి వైపు చూపే ఆస్కారం లేక, ఒక జీవిపై రెండో జీవి మనస్తత్వపు ప్రభావం పడి స్నేహం కుదరదు.

అలా ఎవరైతే తన exhibition కి అడ్డురారో అలాంటి వారిని వారధిగా ఎన్నుకుని వారి రూపంలో "స్నేహితుడి"గా మారి తన జీవికి పరిచయం అవుతుంది ప్రేమ.

అభిప్రాయాలు, అభిరుచులు కలవక పోయినా అక్కడ స్నేహం వుంటోంది అంటే అక్కడ స్నేహం జరుగుతోంది జీవికి ప్రేమతోకానీ మరో జీవితో కాదుగా.

అలా ఇద్దరికీ స్నేహం కుదిర్చిన "ప్రేమ" వారి మధ్య ఎలాంటి ఫలాలను అందిస్తుందో తెలుసుకుందాం!

స్నేహితుడిగా మారిన జీవి యొక్క ప్రేమ, జీవి ఎలా వుండాలో, ఎలా ప్రవర్తించాలో నేర్పిస్తుంది. నోటితో చెప్పి కాదు చేతలలో చేసి చూపిస్తూ మరీ



నేర్పిస్తుంది.

జీవిని, స్నేహితుడు (ప్రేమ) ఒక సైనికుడిలా తీర్చిదిద్దుతాడు.

రాబోయే జీవితంలో సమస్యలకు ముందుగానే సమాధానాన్ని ఇస్తాడు.

అంటే స్నేహితులు కూర్చుని మాట్లాడుకొనే దానిలో వారికే తెలీకుండా అనేక ప్రశ్నలకు సమాధానాన్ని పొందుతాడు.

స్నేహితుడు (ప్రేమ) జీవి యొక్క లోటు పాటులను చెప్పనే చెప్పడు.

సలహా ఇచ్చి మారమనడు. ఆ లోటును తన భరిస్తూ భర్తీ చేస్తాడు.

గురు శిష్యులు తల్లితండ్రులు పిల్లలు భగవంతుడు భక్తుడు ఇలా ఏ సంబంధంలోనైనా ఎదుటి వారి తప్పును ఎత్తి చూపుతూ సరి చేస్తారు. ఎందుకంటే ఆయా సంబంధాలలో ఇద్దరి జీవుల మధ్య ప్రేమ కాబట్టి ఎత్తి చూపటం వుంటుంది.

కానీ స్నేహితుల మధ్య అది వుండక పోవటానికి కారణం స్నేహితుడు జీవి యొక్క "ప్రేమ"కు రూపం కదా!

తను సరిదిద్దుతూ ఎదుటి వారిని తక్కువ చేయుడు స్నేహితుడు (ప్రేమ) స్నేహితుడి సమక్షంలో జీవి యొక్క జీవలక్షణాలు నెమ్మది వహిస్తాయి. (ప్రేమ) స్నేహితుడు జీవికి అద్దం లాంటివాడు, ఆదర్శం లాంటివాడు.

అంటే తను ఎలా వున్నాడో అద్దంలా జీవికి జీవిని చూపిస్తూ, ఎలా వుండాలో కూడా తను వుండి జీవికి చూపిస్తాడు.

**A Friend is not only a Mirror but also a Model**

నిజ స్నేహితుడు మనకు మనలా వుంచుతూ,

శరణాగతిని నేర్పిస్తాడు.

వివరణ : మనల్ని మారమని, ఇలా వుండమనీ, అలా వుండమనీ చెప్పడు. కానీ మనమే అలా మారిపోతూ వుంటాం. వారిని చూసి నేర్చుకుంటూ వుంటాం. వారు మనకీ చెప్పినట్లు కనబడరు కానీ మనం వారు చెప్పిందే చేస్తున్నట్లు వుంటాం. వారికి నచ్చినట్లే ప్రవర్తిస్తూ వుంటాం.

మన తప్పులని అంగీకరిం చేస్తూ వుండటం వల్ల అహంకారం తగ్గుతూ వుంటుంది.

ఆత్మ చైతన్యాన్ని, దివ్యత్వాన్ని అనుభవించాలి అనుకున్న జీవికి రెండు ముఖ్య లక్షణాలు సొంత వ్యక్తిత్వం శరణాగతి (Individuality, Surrender) వుండాలి అని సత్యం చెప్తుంది.

రెండూ ఏక కాలంలో జీవి maintain చేస్తేనే లోపల జాగృతి వస్తుంది. రెండూ నీరూ, నిప్పు లాంటివి ఒకటి వుంటే రెండోది ఉండదు అక్కడ.

కానీ స్నేహితుడుని (ప్రేమ) పొందిన జీవికి ఒక్కరికే ఇది సాధ్యము.

ఆ స్నేహితుడి వల్ల సొంత వ్యక్తిత్వం వస్తుంది అలాగే ఆ స్నేహితుడిని ఒప్పుకునే, స్వీకరించే శరణాగతి వస్తుంది.

ఇంత గొప్ప లక్షణాలు ఏక కాలంలో జీవికి వుండేలా నేర్పించటానికే ప్రేమ స్నేహితుడి రూపాన్ని ధరిస్తుంది.

స్నేహితుడు భవిష్య దర్శిని.

స్నేహితుడు తన ప్రమేయం లేకుండానే మనకెన్నో విషయాలలో Educate చేస్తాడు. ఎంతో information ఇస్తాడు. జీవికి భవిష్యత్తులో ఒక్కో విషయాన్ని face చేస్తున్నప్పుడు, స్నేహితుడు ఇచ్చిన మెలకువ గుర్తుకు వచ్చి అన్వయించుకుంటాడు. అందుకే స్నేహితుడిని, జీవి యొక్క ప్రశ్నలకు ముందస్తు సమాధానం.

సత్య పురోగతికి అదే అందరూ అనే ఆధ్యాత్మిక పురోగతికి కావాల్సిన పునాదిని వేసేది స్నేహితుడే. ఆ పునాది ఏంటి అంటే సొంత వ్యక్తిత్వం, శరణాగతి.

జీవి వెయ్యలేని అడుగును స్నేహితుడు జీవి కాలుతోనే వేస్తాడు.

వివరణ : జీవి తనకు అసాధ్యం అనుకుని వదిలేసిన పనికి కావాల్సిన మెలకువను ఆ జీవి ఆలోచనలో పుట్టించి, ఆ జీవి విశ్లేషణలోనే workout చేయించి, ఆ జీవితోనే ఫలాన్ని ఎత్తుకునేలా చేస్తాడు స్నేహితుడు.

జీవి విజయాన్ని, జీవి కన్నా కోటిరెట్లు ఎక్కువగా ఆనందించే స్నేహితుడు గొప్ప సంస్కారి.

జీవి యొక్క అపజయాన్ని ఒప్పుకోగలిగి, దాన్ని విజయంగా మార్చుకోగలిగే ధైర్యాన్ని ఇస్తాడు స్నేహితుడు.

ఇలా ఆధ్యాత్మికానికి కావాల్సిన పునాదిని



వేసే బాధ్యతను నిర్వర్తించటానికి స్నేహితుడిలా ఎదురైన ప్రేమ, ఆ పని పూర్తి కాగానే తిరిగి జీవి వద్దకు వచ్చేస్తుంది.

అంటే జీవికి Individuality, Surrenderence నేర్పించిన వెంటనే తిరిగి జీవితోనే వుంటుంది.

అంటే స్నేహితుడిగా వున్న జీవితో బంధం వదలీయదు. వారి నుండి క్రమేణా దూరం చేస్తుంది.

పునాది పడేవరకు అత్యంత సమీపంగా వుంటూ, అది అయ్యాక నిదానంగా పరిస్థితులను పెట్టి దూరం పెంచుతుంది.

తిరిగి ఎప్పుడైనా ఎదురైనా అదే స్నేహాన్ని maintain చేస్తాడు స్నేహితుడు.

దూరమవ్వడం అంటే ఏదో ఘర్షణ జరిగి కాదు క్రమేణా అతని పాత్ర అవసరమవ్వగానే తెరమరుగు అవుతుంది.

సత్యం అంతే కదా! జీవి ముందుకి ముందికి వెళ్ళాలంటే పునాది పైన అంతస్తులు వేసుకుంటూ వెళ్ళాల్సిందేగా. మళ్ళీ ఏదైనా పని రాగానే తిరిగి "ప్రేమ" స్నేహితుడిలా వచ్చి పని పూర్తి చేస్తుంది. ప్రేమ ఆ ఫలంతో జీవిని చేరుకుంటే స్నేహితుడి పాత్ర క్రమేణా తెరమరుగు అవుతుంది.

అంతటి స్నేహితుడిని దూరం చేసాడు దేవుడు కఠినాత్ముడు, విధి బలీయమైనది లాంటి డైలాగులు వినిపిస్తుంటాడు.

కానీ అలా జరిగితేనే మంచిది ఎవరి పురోగతిలో వాళ్ళు వుంటారు ఒకే స్నేహితుడు జీవితాంతం వుండటానికి నీకు స్నేహం జీవితో కాదుగా నీ ప్రేమతోనేగా.

కాబట్టి ఆ ప్రేమ అవసరానికి తగినట్లు పలు రూపాల్ని తీసుకుని ఎదురవుతుంది. అంటే స్నేహితులకి నీకు కొదవలేదు. సత్యాన్ని నువ్వు అర్థం చేసుకోగల్గాలి.

లేదు నాకు అప్పుడు వాడు సహాయం చేసాడు, అంతటి ఓదార్పు నిచ్చాడు వాడే కావాలి, ఆ స్నేహితుడినే వుండాలి అని పంతం పట్టి, బంధాలు వేసుకుని, కింద స్థాయిలోనే వుంటూ మానసికంగా బలహీనం అవుతాను అంటే సత్యం

ఒప్పుకోదు సరికదా నువ్వు చెడిపోవటం ఇష్టం లేక నీకు స్నేహితులనే లేకుండా చేస్తుంది.

కాబట్టి సత్యాన్ని అర్థం చేసుకో.

చేసుకుంటే నీకు కావల్సిన పునాది వేయటానికి స్నేహితుడిగా ఎదురైన ప్రేమ, ఆ పని కాగానే నీ దరికి వస్తుంది.

వచ్చి నీకు, నీ దివ్యత్వానికి స్నేహాన్ని కుదిర్చి నిన్ను దివ్యత్వంలో నిలిపే పని చేస్తుంది.

కాబట్టి సత్యాన్ని అర్థం చేసుకో.

చేసుకుంటే నీకు కావల్సిన పునాది వేయటానికి స్నేహితుడిగా ఎదురైన ప్రేమ, ఆ పని కాగానే నీ దరికి వస్తుంది.

వచ్చి నీకు, నీ దివ్యత్వానికి స్నేహాన్ని కుదిర్చి నిన్ను దివ్యత్వంలో నిలిపే పని చేస్తుంది.

అలా నువ్వు దివ్యత్వంలో నిలిచాక, నీకు సత్యం అర్థమై వుంటుంది. కాబట్టి నీకు అందరూ స్నేహితులే. నువ్వు అందరికీ స్నేహితుడివే. నువ్వు పూర్తిగా దివ్యత్వంలో నిలబడ్డాక, నీ దివ్యత్వ ప్రభావంతో, ఇంకొకరిని వారి దివ్యత్వంలో నిలబెట్ట గల స్థాయి వచ్చినప్పుడు నీకు ఎదురైన వారు నీతోనే వుంటారు. దివ్యత్వం ఎవరిదైనా ఒకటే కదా. కాబట్టి వారు వేరు కావాల్సిన  అవసరం రాదు.

అలాగే దివ్యత్వంలో నిలిచిన ఇద్దరి స్నేహం ఎప్పటికీ విడిపోదు, వారూ ఎప్పటికీ విడిపోరు.
స్నేహితుడంటే ఇంత గొప్పవాడు జీవికి.
స్నేహ ఫలం ఇంత గొప్పగా వుంటుంది.
ఆ ఫలం "ప్రేమే" ఇప్పించ గలదు.
కాబట్టి నీ "ప్రేమే" స్నేహితుడిగా ఎదురువస్తుంది నీకు.
ప్రేమే స్నేహితుడిలా దానంతట అదే ఎదురు వస్తే,

జీవిత భాగస్వామి విషయంలో, ఎదురైన వారిలో మనం మన ప్రేమ నిలిపి సదా చూసుకుంటాం. మనం నిలిపి, పట్టి వుంచి సదా వుంటాం. అందుకే జీవిత భాగస్వామిని కూడా స్నేహితుడిలా మార్చుచ్చు అనే కంటే ఆలోచన రానీయక సత్యాన్ని అర్థం చేసుకోండి.

**My Dear Friends !**



## ఐశ్వర్యం ప్రేమ - ఆరవ రోజు

'ప్రేమ'ని అన్ని కోణాల నుంచి విశ్లేషించుకున్నప్పుడు, ఐశ్వర్యం ప్రేమకు గల సంబంధాన్ని కూడా తప్పకుండా విశ్లేషించుకోవాలి.

లేకుంటే మన అవగాహన అసంపూర్తిగానే వుంటుంది.

ఐశ్వర్యం అది ఆధ్యాత్మికం కానీ ప్రాపంచికం కానీ దాని గురించి తెలుసుకోవాలి.

ప్రాపంచిక ఐశ్వర్యం : డబ్బు, నగలు, హోదా, పలుకుబడి, పదవి, కీర్తి ప్రతిష్ఠలు, విద్య మొదలైనవి.

ఆధ్యాత్మిక ఐశ్వర్యం : స్థితి గతులు, మహిమలు, ఆత్మ, జ్ఞానము, విజ్ఞానము మొదలైనవి.

మిగిలిన అన్ని సంబంధాలలో ప్రేమ అన్నీ అయి నడిపిస్తోంది.
ప్రేమే ఇరువర్గాల మధ్య ఫలిస్తోంది. ప్రేమే భగవంతుడుగా, ప్రేమ స్నేహితుడిగా మారుతోంది. "ప్రేమే" ప్రేమను ఇస్తూ వచ్చింది. పై సంబంధాలు అన్నింటిలో, జీవికి ఎదుటివారికి మధ్య నిలబడి జీవి ఎదుటివారిని ప్రేమించేలా చేసింది.

ఐశ్వర్యం విషయంలో మాత్రం, ఐశ్వర్యం జీవిని ప్రేమించేలా చేస్తుంది ప్రేమ. అంతేకాని జీవికి ఐశ్వర్యం పై మోజు కలిగేలా చేయదు.

ఐశ్వర్యం జీవిని అంటకుండా, జీవి వెనకాల పడీపడీ పడి వచ్చేలాగా చేస్తుంది.

అలా ఎలా చేస్తుందో తెలుసుకొందాం! ప్రేమ మనకు, ఐశ్వర్యం వెనకాల జీవి పడే కొద్దీ అది ఎండమావిలా మురిపిస్తుందన్న సత్యాన్ని బోధపరుస్తుంది.

తర్వాత జీవి అభివృద్ధికి అది ఆధ్యాత్మికం కానీ, ప్రాపంచికం కానీ దేనికైనా దోహదం చేసేది ఐశ్వర్యం కాదన్న సత్యాన్ని బోధపరుస్తుంది. ఆయుష్షు ఉన్నప్పుడు బతకటానికీ, తర్వాత జీవించటానికి ఆధారం ఐశ్వర్యం కాదన్న సత్యాన్ని నిరూపిస్తుంది.

బతకటానికి ఆధారం "భగవంతుడి ఇష్టం" కానీ ఐశ్వర్యం కాదని నేర్పిస్తుంది. అంటే భగవంతుడి నీ బతుకుని ఇష్టపడితే ఆ ఇష్టమే నిన్ను సుఖంగా జీవించేలా చేస్తుంది కానీ ఐశ్వర్యం కాదని నిరూపిస్తుంది.

అన్నిటి కన్నా గొప్ప ఐశ్వర్యం "భగవంతుడు మనలను ఇష్టపడటమే" అని నేర్పిస్తుంది.

బతక గలుగుతున్నాం అంటే అది భగవంతుడి ఇష్టం

తిన గలుగుతున్నాం అంటే అది భగవంతుడి కృప.

నలుగురులో గౌరవం పొందుతున్నాం అంటే అది భగవంతుడి క్షమ.

(ఒక జీవి, గొప్పగా గౌరవించబడుతున్నాడు అంటే ఆ జీవి తప్పుఒప్పులను భగవంతుడు క్షమించి, వాడిని ఆదరించబట్టే కదా)

సౌకర్య వంతంగా ఉన్నాం అంటే భగవంతుడిదయ.

ఆధ్యాత్మికంగా స్థితిగతులలో ఇరుక్కుపోకుండా కాపాడ బడుతున్నాం అంటే మహిమ కాదు భగవంతుడి ఆదరణ

తేటతెల్లంగా నీ సత్యాన్ని తెలుసుకోగల్గుతున్నావు అంటే అది నీపై భగవంతుడికి వున్న అపారమైన ప్రేమ.

నువ్వు చక చక పురోగభివృద్ధి చెందుతూ లోనికి ప్రయాణం చేస్తున్నావంటే అక్కడ నీ భగవంతుడు నీ కోసం చూస్తున్న ఎదురు చూపు

పురోగభివృద్ధి చెందుతున్నప్పుడు నీ వెనకాల సంపద పడి వస్తోందంటే నువ్వు సంపద అనందించటానికి నీ భగవంతుడి ఆమోదం

నువ్వు నడిచిన నీ మార్గం, నీ విధానమే సృష్టికి ఆదర్శవంతమవుతోంది అంటే దాని కారణం నిన్ను, నీ భగవంతుడు వరించటం.

చివరకు ఆ భగవంతుడు వేరే ఎవరో కాదు నువ్వే అని చూపటం భగవంతుడి యొక్క గొప్పతనం, ఔదార్యం.

ఇలా దేనికైనా నీ భగవంతుడే కారణం. ఆధారం కానీ ఐశ్వర్యం కాదు అన్నీ సత్యాన్ని తెలియ చేస్తుంది జీవికి సహచరి అయిన ప్రేమ.

మర్యాదగా వింటే మర్యాదగా చెప్తుంది.

వినకపోతే, సత్యాన్ని స్వీకరించకపోతే జీవితంలో అనేక మలుపులను పెట్టి కొంచెం ఖఠిన పద్ధతిలోనైనా విషయాన్ని అవగాహన చేస్తుంది.

ఆత్మ దానంతట అది వరించాల్సిందే అని చెప్తుంది.



అది వరించాలంటే ఉండాల్సిన పట్టు విడుపులు నేర్పిస్తుంది.

ఇన్ని రోజులూ నేర్పించింది అదే కదా. ఏ సంబంధాలలో దేనిని పట్టుకోవాలో దేనిని విడువాలో నేర్పించింది కదా.

ఆత్మ (అనగా నీ దివ్యత్వం) నిన్ను వరిస్తే ఐశ్వర్యం నీ వెనుక పడివస్తుంది.

నీకు దివ్యత్వంలో నిలబడటం వచ్చిన తర్వాత నీ సంపదను నువ్వు వాడుకోవటంలో లెక్కా పద్దులు వుండవు. అదే నీకు వాడబడుతుంది.

అప్పుడు నువ్వు ధనాన్ని వాడినా ఋణం వుండదు.

ప్రతిష్టని వాడినా అప్రతిష్ట వుండదు.

కీర్తిని వాడినా అపకీర్తి వుండదు

నలుగురులో పెద్దరికాన్ని చలామణీ చేసినా చిన్నబోవాల్సిన పని వుండదు.

సత్యం దగ్గర.

అప్పుడు నీ దివ్యత్వం నీకు వాడబడుతుంది లెక్క లేకుండా అప్పుడు నీ వాడకాన్ని, వాడబడటాన్ని ప్రశ్నించిన వారికే పంచాయితీ కానీ నీకు కాదు. నువ్వు ఏ రంగులో అయినా నీ ఐశ్వర్యాన్ని వాడుకోవచ్చు. అంటే నేను సంపాదించాను అన్న ధోరణిలో (Black) అయినా

భగవంతుడు ఇష్టమై ఇచ్చాడు అన్న ధోరణిలో (white) అయినా వాడచ్చు. full పర్మిషన్.

ఐశ్వర్యం నిన్ను ప్రేమించి నీ వెనకాలబడి వస్తోంది కాబట్టి నీకు లెక్క పడటం లేదు అంటే ఐశ్వర్యం నీకు అంటటం లేదు.

అలా నీకు నీ ఐశ్వర్యం ప్రేమించి నీ వెనకాలపడి వస్తుంటే నీకు వుండే ఐశ్వర్యం: తేటతెల్లం, దేనిలోనైనా, చొచ్చుకుని దూసుకుపోగల సమర్థత, సమయ స్ఫూర్తి, పరిశుద్ధత, ప్రేమతో జోడి సత్యంగా వుంటూ, సత్యంతో జోడి ప్రేమగా వుంటూ, కరిగిపోయే కాలంలో, కలిసిపోయే లోకంలో కాక నిజమైన లోకంలో నిజమైన పద్ధతిలో హోదా, కీర్తి ప్రతిష్టలు, అపరిమితమైన ధైర్యం, నీ ముందుకు వచ్చి ఏ ముద్రైనా విడిపడిపోవటం.

## కాలము ప్రేమకు గల సంబంధం - ఏడవ రోజు

జీవికి మనుష పుట్టుక ఎంతో ఉత్తమమైనది.

మానవ జన్మలోనే జీవి తన లక్ష్యాన్ని పొందగలదు.

మానవ జన్మ కాలము పరిమితము. కాబట్టి ఆ పరిమితమైన కాలంలోనే తన పనిని పూర్తి చేయాలి.

అందుకే జీవికి కాలము చాలా విలువైనది. ఏ మాత్రము కాలాన్ని వృధా చేసినా అనక పశ్చాత్తాప పడుతూ మరికొంత కాలము వృధా అవుతుంది.

ఈ కాలమును జీవి ఎలా వినియోగపరుచుకోవాలో 'ప్రేమ' నేర్పిస్తుంది.

"ప్రేమ" కాలం గురించి జీవికి నేర్పే విషయాలు :-

భగవంతుడి చేత జీవికి ఇవ్వబడిన కాలం <u>ఈక్షణం</u> ఈక్షణాన్ని ఆనందించి ఆస్వాదించడానికే భగవంతుడిచ్చిన అనుజ్ఞ. అందుకని ఆ క్షణంలో గత వైభవాన్ని నెమరు వేసుకుంటూనో లేక గతానికి ప్రాయశ్చిత్తం చేసుకుంటూనో వృధా చేయకూడదు. అలా ఆ క్షణంలో భవిష్యత్తు ప్రణాళికలు వేసుకుంటూ వృధా చేయకూడదు.

ఈ క్షణము మాత్రమే నా సొత్తు కదా అని క్షణాన్ని ఏమి చేయలా అని వృధా ఆలోచన చేస్తూ గడపకూడదు.

ఆ క్షణం నీకు ఎలా వాడబడుతుందో చూస్తూ ఆస్వాదించటమే.

ఆ క్షణం దానంతట అదే నీకు వాడబడుతుంది. ఎందుకంటే

1) ఆ క్షణాన్ని ఆస్వాదించటానికి నీకు భగవంతుడి అనుజ్ఞ అయినది.

2) నీ సమస్త సైన్యము ఆ ఆజ్ఞను పాటించటానికి సమాయత్తం అవుతాయి.

3) ఆ సైన్యానికి దిశా నిర్దేశం చేయడానికి నీ సహచరి అయిన ప్రేమ వుంది.

ఈ మూడు మహా కారణాల వల్ల ఆ క్షణం నీకు దానంతట అదే వాడబడుతుంది.

నీకు కావల్సింది విషయ అవగాహనే. ఆ అవగాహన మాత్రం నీవు నిలుపుకుంటే చాలు. లేదంటే పానకంలో పుడకలాగా నీ ప్రేమ నీకు చేసే సేవలో అడ్డు



వస్తావు.

అంటే "ఈ క్షణం" నీ సొత్తు కాదని "ఈ క్షణంలో" వున్న ఆనందమే నీ సొత్తు అని దానిని నీకు నీ ప్రేమే ప్రాప్తింప చేస్తుందనీ అర్థమవుతుందని.

అలాగ వర్తమానం నుంచి నిన్ను విడుదల చేస్తుంది నీ ప్రేమ.

ఇలా వర్తమానంలో వుండి ఆనందాన్ని ఆస్వాదించబట్టి నీకు ముందు క్షణం అంటదు. అంటే ముందు క్షణాలలో నువ్వు తెలిసీ తెలియక ప్రవర్తించి వుండవచ్చు. అంటే తెలిసి నీ ప్రేమను ప్రవర్తించనిచ్చి వుండచ్చు లేక తెలియక నీ ప్రేమను కాదని నువ్వే ప్రవర్తించి వుండి వుండవచ్చు. మంచైనా, చెడైనా ఏదో ఒకటి చేసి వుండివచ్చు. మరి వాటి ఫలం నీ వెనకాలే వస్తుంది కదా!

నువ్వు ఈక్షణంలో వుండి ఆనందిస్తూ వుండే, దానికి భగవంతుడి అనుజ్ఞ వుంది కాబట్టి, ఆ క్షణంలో నిన్ను ఏవీ అంటి disturb చేయవు. అవి నీ సొంత కర్మ ఫలాలు అయినా సరే!

అంటే నీకు నీ కర్మ యొక్క ఫలాన్ని అంటనీయకుండా చేస్తోంది నీ ప్రేమ.

అలా నువ్వు ఎంత కాలం "ఈక్షణం" అంటే present లో వుంటావో అంత కాలం నీకు past యొక్క ఫలాలు అంటావు.

నువ్వు ఎల్లప్పుడూ present లో వుండేలా చేసేందుకు నీకు ఎలాగో నీ సహచరి ప్రేమ వుండనే వుంది.

కర్మ ఫలాలను త్యాగం చేయటం, నిష్కామ కర్మ చేయటం లాంటివి మనం తెలుసుకుని, అన్వయించుకుని, విజయం సాధించాల్సిన పని లేకుండా "ప్రేమ" వల్ల అంతా అలాగే జరిగిపోతుంది.

ఇలా "ప్రేమ" జీవికి past అంటక present లో వుంచుతూ కర్మ ఫలాల నుండీ కాపాడుతుంది.

Present లో వుండి ప్రేమ సహాయంతో వున్నప్పుడు అసలు జరిగేదే నిష్కామ కర్మ కాబట్టి కర్మ ఫల ప్రసక్తే లేదు.

అలాగే "ప్రేమ" ధైర్యాన్ని సమయ స్ఫూర్తిని ఇస్తుంది.

నీకు ముందు ముందు తట్టుపడే ప్రశ్నలకు సమాధానాన్ని స్నేహితుడి రూపంలో

ముందస్తుగానే ఇస్తుంది.

ఒక వేళ నువ్వు దానిని సరిగా గమనించి వుండకపోతే, ఆ పరిస్థితిలో ప్రేమే అప్పటి కప్పుడు Spontanious గా React అయి నిన్ను కాపాడుతుంది.

ప్రేమ దాని work out ని పూర్తిగా నీకు బోధ పరుస్తుంది.

ఈ అన్ని కారణాల వల్ల నీకు భవిష్యత్తు గురించిన బెంగ వుండదు.

ఏంటి? అన్న ప్రశ్న ఉదయించ నీయకుండా ప్రేమే నిన్ను కాపాడుతుంది.

ఇలా భూత, భవిష్యత్తు, వర్తమానాలను నీకు అంటక నిన్ను కాలానికి అతీతంగా చేస్తుంది కాబట్టి, అలా కాలానికి అతీతంగా వుండేది భగవంతుడే కాబట్టి నువ్వు భగవంతుడివే. అలా చేయగలిగేది భగవంతుడే కాబట్టి ప్రేమ భగవంతుడే.

ప్రేమకు మూడు కాలాలు ఒకటే. మూడు కాలాలు ఏకకాలంలో జరిగి పోతుంటాయి.

దీని వల్ల నీకు కర్మ ఫలాలు అంటవు, ముందస్తుగా తెలుసుకోవటానికి జాతకాలు వెంట పడక్కర్లేదు, ఈ క్షణాన్ని ఆనందించటానికి ప్రయాస పడక్కర్లేదు.

అందుకే "ప్రేమ" ను పని చేయనిచ్చే వారికి గ్రహ ప్రభావాలు, కర్మ ప్రభావాలు జాతకాలు పని చేయవు.

ఏ క్షణం నువ్వు సత్యాన్ని మరచి past, future లోకి వెళ్తావో అప్పుడే నీకు ఇబ్బంది.

అయితే క్రమేణా సత్యాన్ని మరిచేదే లేకుండా నిన్ను నీ ప్రేమ కాపాడుతుంది.

అసలు ఆధ్యాత్మికంగా ఈ కాలానికి అతీతం కావడం అన్నది ఎంతో గొప్ప విషయం.

అది "ప్రేమ" వల్ల ఎంత తేలికగానో వచ్చేస్తోంది.

ఇదంతా చేస్తూ "ప్రేమ" నిన్ను ఫలాన్ని ఈ క్షణంలోనే పొందేలా చేస్తుంది.

ఈ సంభాషణ చిన్నగా అనిపించవచ్చు కానీ అది నిన్ను తిన్నగా నీ గమ్యాన్ని చేర్చే మూల మంత్రం.



## ప్రేమ యొక్క పూర్తి ఫలాలు - ఏనిమిదవ రోజు

జీవి తన నిరంతర సహచరి అయిన ప్రేమ ద్వారా పొందే ఫలితాలు పూర్తి పూర్తిగా తెలుసుకుందాం.

ప్రేమ నీకు తోడుగా, రక్షకుడిగా పుట్టుకతోనే వుంటుంది.

ఆ ప్రేమ నిన్ను నిన్నుగా స్వతంత్రంగా ఎదగ నిస్తూ నీ తల్లి తండ్రులకు నిజ సుఖాన్ని ప్రాప్తింపచేస్తుంది.

ఆ ప్రేమ నీకు స్నేహితుడిగా ఎదురై నీకు స్వతంత్ర వ్యక్తిత్వాన్ని, శరణా గతిని నేర్పిస్తుంది.

ఆ ప్రేమ నీకు ధైర్యాన్ని ఇచ్చి సైనికుడిగా మారుస్తుంది.

ఆ ప్రేమ నీకు నిజాన్ని తెలుపుతూ Educate చేస్తుంది.

నీ జీవిత భాగస్వామిగా నీ ప్రేమను చేసుకోవచ్చు. లేక నీభాగస్వామిలో నీ ప్రేమనూ నిలుపుకోవచ్చు. ఏ పద్ధతిలో అయినా నీకు భాగస్వామి ప్రేమే.

నీ వారసుల రూపంలో వుండి నీకు నిజ సుఖాన్ని ప్రాప్తింప చేస్తుంది.

నిన్ను గురువు వద్దకు చేర్చి నీ ప్రేమ బ్యాలెన్స్ ని మరింత పెంచుతుంది.

ఐశ్వర్యం నిన్ను వరించేలా చేస్తుంది.

నిన్ను కాలానికి అతీతం చేసి "అపరిగ్రహుకుడి" గా చేస్తుంది.

నువ్వు నీ దివ్యత్వంలో నిలబడలేని ప్రతిసారి ప్రేమ నిన్ను తన చేతిలోకి తీసుకుని తప్పటడుగు పడకుండా కాపాడుతుంది.

చివరకు నిన్ను నీ దివ్యత్వంలో నిలిపి నిన్ను భగవంతుడి చేస్తుంది.

అలా భగవంతుడు అయిన నీతో నీ ప్రేమ జతకూడుతుంది.

నిన్ను సత్యంగా నిలబెట్టి, ప్రేమగా జోడీ కడుతుంది.

నిన్ను ప్రేమగా నిలబెట్టుకుని అది సత్యంగా జోడీకడుతుంది.

నిన్ను నిన్నుగా నిలబెట్టి నీకు ప్రేమ, సత్యం అనే రెండు జంట ఫలాలను

ఇచ్చి నిన్ను ఫలవంతం చేస్తుంది.

నువ్వేంటో నీకు అర్ధమవ్వటంతో శరీరం మీద మోజు వుండక మరణం నీకు తృణ ప్రాయం అవుతుంది. శరీరాన్ని ఒక dress గా ఒప్పుకోగల్గటంతో మరణాన్ని జయిస్తావు.

మరి నీ శరీరం లేనప్పుడు నీ సహచరి అయిన ప్రేమ ఏమి చేస్తుంది?

నీ శరీరం శాశ్వతం కాదు కాబట్టి, నిన్ను నీ ప్రేమ శాశ్వతుడిగా ఆ శరీరం వున్నప్పుడే చేసుకుంటుంది.

నీ బుద్ధిని వివేకంగా దానిని స్ఫూర్తిగా మారుస్తుంది. ఆ స్ఫూర్తితో జీవి సర్వాన్ని ఎరుగుతూ వుంటాడు. దాంతో జీవి సూక్ష్మాతి సూక్ష్మమై పోతాడు అతని దివ్యత్వం అవధులు లేకుండా పెరుగుతుంది. జీవికి స్పృహ ఏర్పడి అంటే చైతన్యం ఏర్పడి అది సదా నిలుస్తుంది. ఆ జీవి చైతన్యంగా Exist అవుతూ వుంటాడు. కేవలం Existance దానిలో ప్రేమ, సత్యం అనే జంట ఫలాలు ఏర్పడతాయి.

జీవి ప్రేమగా, సత్యంగా, ఉనికిగా శాశ్వతుడు అవుతాడు. అలా శాశ్వతుడైన చైతన్యంతో ప్రేమ జోడీ కడుతుంది.

ఇలా తనకు శాశ్వతుడైన జోడీ కోసం ప్రేమ జీవిని శాశ్వతుడిగా చేస్తుంది.

ఇలా జీవి మొదటి నుంచీ చివరి దాకా సర్వం తానై

నడిపిస్తుంది. ఇప్పిస్తుంది. తనలా మార్చుకుంటుంది.

ప్రేమ ఉండబట్టే నువ్వు నీదైన నీ అనంత దివ్యత్వంలో నిలబడినప్పుడు నీ ప్రేమగా నువ్వు విడవడి ఆ దివ్యత్వాన్ని ఆనందిస్తున్నావు.

ప్రేమ లేకపోతే ఆ దివ్యత్వంలో ఏకమైతే ఆస్వాదన ఏది?

దివ్యత్వం ఎంత ఎదుగగలదో, ప్రేమ అంతగా దానిలో కరిగిపోక నిలిచి వుండేలా ఎదగాలి. దివ్యత్వంతో సమన్వయంగా వుంటూ, దానితో పోటీ గా పెరుగుతూ, దానిని అధిగమించి దానిలో నిండొక్కు, కోగలిదే ప్రేమే.



ఆ ప్రేమ నిలబడక పోతే అంతా శూన్యమే.

ప్రేమ లేకుండా ఏ పద్ధతిలో దివ్యత్వంలో నిలిచినా నీకు మహా శూన్యమే అనుభవం అవుతుంది.

ప్రేమ వుండి, నిలిచి, దివ్యత్వంలో నిలిస్తే నీకు పరిపూర్ణ చైతన్యము అనుభవం అవుతుంది.

ఇది ఎంతో పరమ సత్యం. పరమ రహస్యం. అది నీకు బోధపడిందంటే, తెలుసుకోగలిగే అవకాశం వచ్చిందంటే అది నీకు నీ సహచరి అయిన "ప్రేమ" వల్లే కదా!

అందుకే మనం

**"దేవా! మీ పై ప్రేమను ఇంకా ఇంకా ఇంకా పెంచండి. ఎంతటి ప్రేమంటే నిన్ను నిన్నుగా నా వాడిగా, నన్ను నన్నుగా నీ దానిగా నిలబెట్టి ఆనందింప చేసే అంతటి ప్రేమను పెంచండి" అని ప్రార్థించుకుంటాం!**

ఈ ప్రార్థన తెలియబడటం "ప్రేమ" వల్లే కదా!

నీ పైన ప్రేమను దేవా! అని ప్రార్థించటంలో ఉద్దేశం ఆ ప్రేమకు దివ్యత్వం వైపు దిశా నిర్దేశం చేస్తున్నాం. లేదంటే ప్రేమకు ఆకర్షణ జోడీ అయి ఎటోపడి పోతుంది.

నిజానికి ప్రార్థన కూడా అక్కర్లేదు. "ప్రేమ" అదే పెరుగుతుంది. కానీ ఆ ప్రార్థన వల్ల మనకు ప్రేమ పట్ల అవగాహన పెరుగుతుంది. "ప్రేమ" గురించి పూర్తి అవగాహన కోసమే ప్రార్థన. ఆ ప్రార్థనతో మనం ప్రేమ వైపు తిరుగుతాం అది ఎలాగూ మన వైపే తిరిగి వుంటుంది కాబట్టి మనకు ముఖా ముఖి ఏర్పడుతుంది ప్రేమ.

ఇలా నీ ప్రేమ, నీ శరీరంతో పాటు పుట్టి, నిన్ను నీ శరీరానికి అతీతంగా శాశ్వతుడిని చేసి అది నీతో జతగా శాశ్వతంగా వుంటుంది.

సర్వం ప్రేమమయం.

కొన మెరుపు : ప్రేమ యొక్క కొనలు తళతళలాడుతూ మెరుస్తున్నాయి.

ప్రేమ అవినాశి నిన్ను నాశనం కానివ్వదు.

ప్రేమే ఆది ప్రేమే మధ్యన, చివరన ప్రేమే వుండి నీకు అంతం అన్నది లేకుండా చేస్తుంది.

ప్రేమ బానిస లాగా నీకు పని చేస్తూ నిన్ను రారాజును చేస్తుంది.

పుట్టుట, గిట్టుట లేదు కాబట్టి ప్రేమే భగవంతుడు.

నిన్ను నీతి తప్పనివ్వదు కాబట్టి ప్రేమే సత్యము.

శాశ్వతుడివైన నీ జోడీ నీ ప్రేమ కాబట్టి ప్రేమే నిత్యము.

హద్దులు లేకుండా పెరుగుతుంది కాబట్టి ప్రేమ అనంతము.

నీ సైన్యానికి దిశా నిర్దేశం చేస్తుంది కాబట్టి ప్రేమే యుజమాని నీ సైన్యానికి.

ఈ ప్రేమ నీలోనే ఫలిస్తోంది కాబట్టి ముక్తి ప్రేమ.

శాశ్వతమైన నీ చైతన్యం = నీ ప్రేమ = సత్యం = దివ్యత్వం = పరిపూర్ణత్వం.

హెచ్చరిక : ఇంత తెలుసుకుని ఓహో ఇప్పుడు నేను ప్రేమించాలి అనుకుని, ఏదో చేయాలని బయలుదేరి ఆకర్షణలో, మోహంలో పడి నాశనం కాకండి. ప్రేమని ఇప్పుడు మీరు పుట్టించుకు, పెంచుకోనక్కర్లేదు.

అదే మీ కన్నా ముందే వుండి మీ శరీరంతో పాటు మీకు తోడుగా వచ్చింది. దానంతట దానిని పని చేయనీయండి దానికి "ప్రేమ"ను పూర్తిగా అర్థం చేసుకోండి.

ప్రేమ దానంతట అది work out లోకి వచ్చే వరకూ ఆకర్షణలో మోహంలో పడి అదే ప్రేమ అనుకోమని మీకు మీరు ప్రమాణం చేసుకోండి సంకల్పించుకోండి అదే మిమ్మల్ని కాపాడుతుంది.



## ప్రేమ ఫలానికి ఒక ఉదాహరణ - తొమ్మిదవ రోజు

ప్రేమ గురించి ఇంత వివరించి, అది పొందిన విజయాన్ని ఒకటి ఉదాహరణగా చూపించకపోతే ఈ భాషణం సమాప్తం కాదు.

నా దగ్గర నా బిడ్డ ఒకటి ప్రేమ ఫలాలను పూర్తిగా పొంది, ప్రేమగా నిలిచి వుంది. కానీ దాని ఉదాహరణ మీకు చూపితే మీ చూపులు, మీ ప్రశ్నలు నా బిడ్డ మీద సంధిస్తారు. వాటి వేడి చూపులు నా బిడ్డ మీద.

అలాగే మీకు ఉదాహరణ చూపించకుండా ఉండలేను అది మీ మీద ఉన్న ప్రేమ.

కాబట్టి మీరు గొప్పగా, మహనీయులుగా భావించే వారిని ఉదహరించి చెప్తాను. మీరు ఆస్వాదిస్తారు. రామాయణాన్ని ప్రేమ ఫలంగా ఉదహరించి చెప్తే :-

దివ్యత్వాన్ని అనుభవించాలనే కోరిక (రాముడు) అతను తన సహచరి అయిన ప్రేమతో శరీరాన్ని తీసుకున్నాడు. ఆ ప్రేమ అతనిని తల్లిదండ్రుల రూపంలో అల్లారు ముద్దుగా పెంచింది. ఆ ప్రేమే అతనిలోని జీవలక్షణాలు అతన్ని దాడి చేయకుండా, భగవంతుడిని పొందాలనే యాగాన్ని కాపాడింది. ఆ ప్రేమే గురువు రూపంలో ఎదురై అతని నిజస్థితిని, నిజ పనిని గుర్తు చేసింది.

ఆ గుర్తుతో భగవంతుడిని అనగా వారి దివ్యత్వాన్ని ఎరిగే ప్రయత్నం చేసారు. దానిలో భాగంగా జ్ఞానం (సీత) స్వయంగా వచ్చి రాముడిని వరించింది. ఆ జ్ఞానం వల్ల ప్రపంచానికి అతీతం కావాలని నిర్ణయించుకుని తనలో బాహ్య ప్రపంచాన్ని వదిలి, తన అంతః ప్రపంచానికి ప్రయాణం ప్రారంభించాడు. ఆ ప్రయాణంలో ప్రేమ స్నేహితుడిలా (లక్ష్మణుడు) వెన్ను దన్నుగా నిలిచింది. ఆ ప్రయాణంలో జ్ఞానం అశాశ్వతమైన మార్గాన్ని ఎదురు తీసుకురావడంతో ప్రేమ జ్ఞానాన్ని తిరస్కరించింది. జ్ఞానం కాదు సత్యం పొందాలని ప్రయత్నించిన

రాముడిలో, శక్తియుక్తులు చైతన్య వంతం అయ్యాయి. అలా చైతన్య వంతంలోకి వచ్చిన శక్తి యుక్తులను ప్రేమ రామునికి దాసుడిగా చేసింది. ఆ దాసుడు ఆ సాధ్యాలను సుసాధ్యం చేస్తూ లక్ష్యాన్ని గుర్తించి, లక్ష్యాన్ని చేధించడానికి మార్గాన్ని ఏర్పరిచాడు అలా ఆ మార్గంలో లక్ష్యం దాకా వెళ్ళిన రాముడు.

పంచేంద్రియాలు, మనసు, బుద్ధి, చిత్తం, అహం, ఎరుక అనేది పది తలలను ఏకతాటిలో నడిపిస్తేనే ఆ బ్రహ్మని పరాగా పరబ్రహ్మం కాగలుగుతానని గ్రహించేలా చేసింది ప్రేమ.

అలా పది తలలను ఏక తాటిలోకి తెచ్చి జయించాక దివ్యత్వంలో నిలబడ్డాడు.

దివ్యత్వంలో నిలబడ్డ రాముని సత్యం వరించింది.

అలా సత్యాన్ని వరించి, ప్రేమగా మారి, ప్రేమను వరించి సత్యంగా మారి, రెండిటికీ అతీతం అయి తను తానుగా నిలబడి సత్యం, ప్రేమ అనే జంట ఫలాలను పొందాలి (ఇది నిజానికి రాముని ప్రేమాణం)

అలాగే జీవి తనలోని సైన్యాన్ని రాధగా మార్చుకుంటే ఆ రాధే (కృష్ణుడిని) దివ్యత్వానికి మార్గాన్ని సూచిస్తుంది.

ఆ రాధే దివ్యత్వాన్ని మురిపిస్తుంది.

ఆ రాధే కృష్ణుడు వలచి వరించేలాగా చేస్తుంది.

నీ సైన్యం రాధగా, దివ్యత్వం కృష్ణుడిగా మారి మధ్యలో ప్రేమ నిలిచి ఫలిస్తుంది.

నేను రాధను అన్నా, నేనే కృష్ణుడిని అన్నా అసంపూర్తే.

నీలోనే రాధ, నీలోనే కృష్ణుడు వుంటేనే పరిపూర్ణం.

అదే ప్రేమ ఫలం. అదే నిజం.